Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 09.02.2018, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 36 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## పార్లమెంట్ సాక్షిగా...

# పరువు నాటకం

ప్రజా పోరాటం



అధికార ఆరాటం



### పార్లమెంట్ వేదికగా టీడీపీ నాటకాలు
### బీజేపీతో పొత్తు తెంచుకోలేని పరిస్థితి
### తెగించి కేంద్రంపై పోరాడలేని దుస్థితి

**ఒక ఎమ్మార్వో పాస్‌బుక్‌లు ఇవ్వడం కోసం రైతుల నుండి లంచం తీసుకుంటూ ఏసిబికి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు... అతనికి ఉద్యోగం పోయింది. పదేళ్ళ సర్వీసు పోయింది. రావాల్సిన బెనిఫిట్స్ పోయాయి. అప్పటిదాకా సంపాదించిన అక్రమ ఆస్తులను ప్రభుత్వం జప్తు చేసుకుంది. జీతం లేక, దబ్బులొచ్చే మార్గం లేక కొడుకు చదువు ఆగింది. కూతురి పెళ్ళి సంబంధం రద్దయ్యింది. కొడుకు చేసిన పనికి బజారులో పరువు పోవడంతో తల్లిదండ్రులు మంచం పట్టారు. భార్య మానసిక రోగంతో ఆసుపత్రిపాలైంది.**

ఒక ఉద్యోగి కేసులో ఇరుక్కుంటేనే ఇంత ప్రభావం ఉంటుంది. అదే ఒక ముఖ్యమంత్రి కేసులో ఇరుక్కుంటే... రాష్ట్రమనే కుటుంబమంతటిపై దాని ప్రభావం వుంటుంది. అలాంటి ప్రభావమే ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌పై పడింది. చంద్రబాబు నాయుడు అనే వ్యక్తి తన రాజకీయ స్వార్థం కోసం చేసిన ఒకే ఒక్క అడ్డదారి పనికి ఈరోజు రాష్ట్రం భారీగా నష్టపోతోంది. తెలంగాణలో ఒక ఎమ్మెల్సీని కొనుగోలు చేస్తూ ఏసిబికి అడ్డంగా దొరికిపోయిన పాపానికి ఈరోజుకీ రాష్ట్రం అన్యాయం పాలవుతోంది. కేవలం చంద్రబాబు ఓటు–నోటు కేసు వల్లే హైదరాబాద్‌లో పదేళ్ళ హక్కున్నప్పటికీ వదులుకుని వచ్చేసాం. చట్టబద్ధంగా హైదరాబాద్‌లోని అన్ని ప్రభుత్వ సంస్థలలో ఏపికి వాటా రావాలి. ఆస్తుల పంపకాలు జరగాలి. అదేమీ లేకుండానే హైదరాబాద్ నుండి రూపాయి ఆస్థి తెచ్చుకోకుండానే వదిలేసి వచ్చాం. కేవలం ఓటు–నోటు కేసులో కేసీఆర్‌కు భయపడే చంద్రబాబు ఏపికి రావాల్సిన ఆస్తుల కోసం పోరాడకుండా మూటాముల్లె సర్ధుకుని వచ్చేసాడు. సరే... అంతటితో నష్టం ఆగిందా అంటే అదీలేదు. ఈ (మిగతా 11వ పేజీలో)




## నెల్లూరు జిల్లా...

# ఎవరెవరెక్కడ?



### ➤ జిల్లాలో పలు కీలక మార్పులు జరగాలి
### ➤ అవగాహన కలిగిన ఇన్‌ఛార్జ్ రావాలి

**రాష్ట్రంలోనే వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ బలంగా వున్న జిల్లాలలో నెల్లూరు అగ్రస్థానంలో ఉంటుంది. బలమైన రాజకీయ కుటుంబాలన్నీ తెలుగుదేశం పార్టీలో వున్నప్పటికీ ఈ జిల్లాలో ప్రజలు మాత్రం వైకాపాకే వెన్నుదన్నుగా వున్నారు. 2014 ఎన్నికల్లో ఈ జిల్లా ప్రజలు వైకాపాకు జైకొట్టారు. రెండు లోక్‌సభ స్థానాలతో పాటు పది అసెంబ్లీలో ఏడింటిని వైకాపాకే కట్టబెట్టారు.**

అప్పటికీ ఇప్పటికీ ట్రెండ్ మారలేదు. 2014ఎన్నికల తర్వాత పలువురు నాయకులు తెలుగుదేశంలో చేరారు. కాని, వారి వెంట కార్యకర్తలు, ప్రజలు పోలేదు. 2014తో పోలిస్తే జిల్లాలో వైకాపా ఇంకా బలం పుంజుకుందనే చెప్పవచ్చు. కాకపోతే నియోజకవర్గాల విషయంలో క్లారిటీ రావాల్సివుంది. ముఖ్యంగా నెల్లూరు లోక్‌సభ స్థానానికి ఈసారి అభ్యర్థిని మార్చాలి. ప్రస్తుత ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిపై వ్యతిరేకత వుంది. కొత్త అభ్యర్థిని రంగంలోకి దించడం అన్ని విధాలా బెటర్. ఈ దిశగా ఇప్పటినుండే కొత్త అభ్యర్థిపై దృష్టిని సారించాల్సివుంది. ఎంపీ అభ్యర్థివల్ల 7అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులకు ఓట్ల పరంగా ప్రయోజనం కలిగేలా ఉండాలి.

ఇక వెంకటగిరి నుండి గత ఎన్నికల్లో పోటీ చేసిన కొమ్మి లక్ష్మయ్యనాయుడు పార్టీకి దూరంగా వుంటున్నాడు. జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డే ఇక్కడ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్నాడు. అయితే ఇక్కడ మాజీ ముఖ్యమంత్రి కుమారుడు కూడా లైన్లో ఉన్నాడు. ఆయన పార్టీలోకి వస్తే మళ్ళీ ఇక్కడ సమీకరణలు మారే అవకాశం ఉంది. అలాగే టీడీపీలో వున్న మరో ముఖ్యనేత పేరు కూడా వినిపిస్తుంది. అందువల్ల ప్రస్తుతానికి ఇక్కడ సీటు ఎవరిదన్న (మిగతా 11వ పేజీలో)

# వేగమందుకున్న ప్రయాణం




సంగం వద్ద కొండల మధ్యలో నుండి వేసిన కొత్త రహదారి ప్రయాణీకులకు గమ్మత్తుగా వుంది. ఈ కొండ రహదారితో ముంబై జాతీయ రహదారిపై వాహన దారులకు ప్రయాణం చాలా సులభంగా అనిపిస్తోంది. నెల్లూరు-ఆత్మకూరుల మధ్య ముంబై రహదారిని సిమెంట్ రోడ్డుగా మార్చడం తెలిసిందే! ఈ పరంపరలో సంగం వద్ద కొండను తొలిచి కొత్తరోడ్డు వేసారు. దీంతో వాహనదారులకు సంగం ఊర్లోకి పోయే పనిలేదు. దాదాపు నాలుగు కిలోమీటర్ల ప్రయాణదూరం తగ్గుతుంది. స్ట్రైట్ రోడ్డయ్యింది. ప్రయాణకాలం కూడా పదిహేను నిముషాల దాకా తగ్గింది. ఇప్పటివరకు అన్ని డిపోల ఎక్స్‌ప్రెస్, సూపర్‌లగ్జరీ బస్సులు సంగం ఊర్లోకి వస్తుండేవి. ఈ రోడ్డు మూలంగా వాటిని బైపాస్‌లుగా మారుస్తారేమోనని సంగం వాసుల భయపడుతున్నారు.




ఈ నెల 5వ తేదీన గూడూరు జడ్పీ బాలికల హైస్కూల్ ఆవరణంలో ప్రారంభమైన డా॥ సి.ఆర్.రెడ్డి వేదిక ఇది. రెండు లక్షల వ్యయంతో గూడూరు ఆంధ్రమహిళా మండలి మరియు ఇన్నర్‌వీల్ క్లబ్ వారు దీనిని నిర్మించారు.

## పెంచలకోనలో చిరుతల చిరునామా?

పెంచలకోన అభయారణ్యంలో 24 దాకా చిరుతపులులు వున్నట్లు అటవీశాఖ సిబ్బంది గుర్తించారు. అటవీశాఖ ఆధ్వ ర్యంలో ఇటీవల రాపూరు అటవీ రేంజ్ పరిధిలో జంతు గణన చేపట్టారు. మొత్తం ఆరురోజుల పాటు ఈ కార్యక్రమం జరి గింది. జంతువుల పాదముద్రలు, పెంటి కలు, వాటి వెంట్రుకలను బట్టి కొన్ని జంతు వులను, ప్రత్యక్షంగా చూసి కొన్ని జంతువు లను గుర్తించారు. చుక్కలదుప్పి, కృష్ణజింక, అడవిపంది, కుందేలులను సిబ్బంది స్వయంగా చూసారు. చిరుతలు 24కంటే ఎక్కువే వుండొచ్చని లెక్కేసారు. 30 రేసు కుక్కలు, 35 అడవిపిల్లులు, 4ఆకుచిరు తలు, 18 చుక్కల దుప్పిలు, 5 కృష్ణ జింకలు, పాతిక అడవి పందులు, 5 కొండ గొర్రెలు వున్నట్లు తేల్చారు.

## నరసింహుడికి రూ.23.17 లక్షల ఆదాయం

నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండలో కొలువైన శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి పూజాద్రవ్యాల విక్రయ హక్కు, దుకాణాల లీజు వేలాన్ని ఈ నెల 5న నిర్వహించారు. వేలం ద్వారా రూ.23.17లక్షల ఆదాయం లభించిందని ఆలయ ఛైర్మన్ మల్లినేని వెంకటేశ్వరరావు, ఇ.ఓ ఆర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ధర్మాదాయ దేవాదాయ శాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణచైతన్య, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ ఆసుపత్రికి అంబులెన్స్ బహూకరణ




నెల్లూరు పొదలకూరురోడ్డు లోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి క్యాన్సర్ హాస్పిటల్‌కు నెల్లూరుజిల్లా కొత్తకోడూరు వాస్తవ్యులు కావల్ రెడ్డి దశరథరామిరెడ్డి ధర్మపత్ని స్వర్గీయ కావల్‌రెడ్డి సుశీలమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు కావల్‌రెడ్డి శ్రీనాథ్‌రెడ్డి క్యాన్సర్ హాస్పిటల్ వినియోగం కొరకు అంబులెన్స్‌ను ఈ నెల 4న నెల్లూరుజిల్లా జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్ చేతులమీదుగా రెడ్‌క్రాస్ అధ్యక్షులు డా॥ ఏ.వి.సుబ్రహ్మణ్యంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కావల్‌రెడ్డి శ్రీనాథ్‌రెడ్డి కుటుంబసభ్యులు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి క్యాన్సర్ హాస్పిటల్ స్థాపక దాత జె.యస్.రెడ్డి, భగవాన్ మహావీర్‌జైన్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, దాతలు, హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిమాన్వితం..బ్రహ్మంగారి 'కాలజ్ఞానం'

శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారు ప్రవచించిన 'కాలజ్ఞానం' బ్రహ్మంగారి మహిమాన్విత శక్తికి నిదర్శనమని ప్రముఖ కాలజ్ఞాన ప్రచారకులు బ్రహ్మశ్రీ వెంకటగిరి వెంకటకృష్ణమా చార్యులు అన్నారు. జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్‌హాలులోని జూ.రేబాల లక్ష్మీనరసారెడ్డి స్మారకభవనంలో ఈ నెల4న జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని కాలజ్ఞాన మహిమను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మహనీయమైన శక్తి గల శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారిని నిత్యం స్మరించుకోవడం ఎంతో శుభకరమన్నారు. జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రొంపిచెర్ల శివరామయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అన్వేషి వీరబ్రహ్మం, చెరుకుపల్లి గోవిందస్వామి, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కందుకూరు చెంగయ్య ఆచారి పాల్గొని 'విశ్వ బ్రాహ్మణ షడ్చక్రవర్తులు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. బాణాల చంద్రబాబు పుస్తక సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో ఇందుకూరు రమేష్‌కుమార్ ఆచారి, కాపులూరు చెంచుకృష్ణ ఆచారి, ఆచారం వెంకటసుబ్రహ్మణ్యం, పేట మాధవయ్య ఆచారి పాల్గొన్నారు.

# వెండితెర విరించి..'సిరివెన్నెల'



తెలుగు సినిమా ఆవిర్భావ వికాస చరిత్రలో స్వర్ణపుటలెన్నో ఉన్నాయి. నాటి నుండి నేటి వరకు దాటివచ్చిన మైలురాళ్ళెన్నో!.. దశాబ్దాల ప్రస్థానంలో మలుపులున్నాయి.. గెలుపులున్నాయి. సామాన్యుడి నుండి సంపన్నుడి వరకు వెండితెర లిఖించిన వినో దంలో 'పాట'ది ప్రత్యేక అధ్యాయం. పల్లవి, చరణం, శృతి, లయల పరిమళమే..పాట. తెలుగు సినిమాల్లో పాటను పల్లవింపజేసిన ప్రతిభామూర్తులున్నారు. పరిమళింపజేసిన ప్రజ్ఞాధురీణులున్నారు. పదు నెక్కించిన విప్లవవాదులున్నారు. పరవశింపజేసి, పసిడి సిరులు పండించిన వారున్నారు.

తెలుగు సినీ గీత రచయితల్లో ఎవరి బాణీ వారిది. ఎవరు ఎవరికీ అనుకరణవాదులు కారు. వారి వారి స్వయంప్రతిభతో రాణించినవారే! పాటల పుప్పొడిని వెండితెర మీద వెదజల్లినవారే! ఈ కోవలో సిరివెన్నెల సీతారామశాస్త్రి సృష్టించిన పల్లవులు, పదవల్లరులు, చరణ మంజీరనాదాలు, సామాజిక చైతన్య నినాదాలు, ఆధునిక అభివ్యక్తులు తెలుగు సినిమా పాటకు వన్నె తెచ్చాయి. వాసిని పెంచాయి.

'సిరివెన్నెల' శాస్త్రి గారిలో పాతతరం సినీ కవుల భావధార ఉంది. అనితరసాధ్యమైన భాషా సంపద ఉంది. సన్నివేశానుగుణంగా, దృశ్యాల్ని బొమ్మ కట్టిం చడంలో నేర్పు ఉంది. అందమైన పదాల కూర్పు ఉంది. సినీ గీతాలకు సాహిత్య గౌరవం కల్పించిన అతికొద్దిమంది గీత రచయితల్లో 'సిరివెన్నెల' ఒకరు. సినిమాలకు కథాబలం ముఖ్యమైనా, పాటల వల్లనే ప్రేక్షకాదరణ పొందిన సినిమాలెన్నో ఉన్నాయి.

'విరించినై విరచించితిని..ఈ కవనం విపంచినై వినిపించితినీ.. ఈ గీతం... అంటూ తొలి సినిమాలోనే వెన్నెల సంతకం చేసిన కవితాసిరి సిరివెన్నెల సొంతం. ప్రాగ్దిశ వీణియపై పరచుకున్న దినకర మయూఖా తంత్రుల్ని గుండెతో మీటగల కలం వారిది. జాగృత విహంగతతుల కిలకిలా రావా లను సుప్రభాత సంగీతంగా ఆలపించగల గళం వారిది. హృదయాల్లో మృదంగాలను మ్రోగించగల శాబ్దిక విన్యాసం వారిది. అర్థసౌరభం వారిది.

గాలి, నీరు, సెలయేరును తన కళ్ళలోగిళ్ళలో ఇముడ్చుకుని, మధురమైన గీతాలతో వెండితెరను వెలిగించిన విలక్షణ కవి..'సిరివెన్నెల'. మూడు దశాబ్దాల సినీ గీత ప్రస్థానంలో పది నందులను గెలుచుకున్న ఏకైక గీత రచయిత సిరివెన్నెల. తొలి సినిమా 'సిరివెన్నెల'కు తన పాటల పూదోటలోని పరిమళాన్నంతా గుప్పించి, అద్భుతమైన గీతాలు రాసి, 'నంది'వర్ధనమై నిలిచిన నిలువెత్తు కవనమూర్తి సిరి వెన్నెల. ఇప్పటివరకు రాసిన వేలాది పాటల్లో జీవన తాత్వికతను, సానుకూల దృక్పధాన్ని, సామాజిక చైతన్యాన్ని నింపి, వ్యక్తిత్వ వికాసానికి కొత్తవాకిళ్ళు తెరిచిన శాస్త్రిగారి కలాన్ని, దాని బలాన్ని చెప్పడానికి నాలాంటి వాళ్ళ పొడిమాటలు చాలవు. వారి గీతాల లోతులు తెలియాలంటే గుప్పెడు గుండెతడి కావాలి.

సినిమాల పేర్లు, పాటల సంఖ్యను అలా ఉం చితే, 'సిరివెన్నెల' సీతారామశాస్త్రిగారి పాటలన్నీ సినీ వినీలాకాశంలో హరివిల్లులై విరబూశాయి. మాటల మబ్బుల్లో మెరుపులై ప్రకాశించాయి. నానా గాన వితానస్వానాలై వానజల్లులా వర్షించాయి. 'స్వర్ణ కమలం' చిత్రంలో స్వేచ్ఛాప్రియురాలైన ఒక యువతి మనోభావాల్ని 'ఆకాశంలో ఆశల హరివిల్లు'..అనే గీతం ద్వారా సిరివెన్నెల ఆవిష్కరించిన తీరు అద్భుతం. ఆ పాటను వింటుంటే, అలనాటి 'మంగమ్మ శపథం' సినిమాలోని 'రివ్వున సాగే..రెపరెపలాడే'.. పాట తళుక్కున గుర్తుకొస్తుంది. సినిమా పాటకు అంత్యప్రాసల అందాల్ని అందంగా సమకూర్చిన వారిలో ఆరుద్ర అగ్రగణ్యులు. ఆ అందాల్ని మరింత అందంగా దిద్దితీర్చిన వారు వేటూరి, సిరివెన్నెల గార్లు.

సినిమా పాటల్లోని శిల్ప రహస్యాల్ని గుర్తించిన కవుల్లో సిరివెన్నెల ఒకరు. అందమైన శిల్పం చెక్కా లంటే ముడి రాయి.. అంటే శిలలోని వ్యర్థాన్ని తొల గించడమే!..'శిల చెక్కుటయనగా..ఒక కల చెక్కుటయే గదా'!..అంటారు మా గురుదేవులు డా.నాగభైరవ గారు. సిరివెన్నెలవారు తన కలం ఉలితో దిద్దితీర్చిన శిల్పాలెన్నో!...

'జగమంత కుటుంబం నాది'..పల్లవితో సాగే పాట దానికదే సాటి. 'నువ్వే కావాలి' సినిమాలో వారు రాసిన టైటిల్‌సాంగ్ ఎంత పాపులర్ అయ్యిందో మనకు తెలిసిందే.!..అలాగే, 'ఠాగూర్' సినిమా కూడా. 'బోటనీ క్లాసును మేటనీ షోతో కలిపిన తొలికవి ఆయన. ఇలా ఎన్ని పాటలైనా చెప్పవచ్చు.

సినిమా పాటను పరిమళ పదగుచ్ఛాలతో అభి షేకించిన సముద్రాల సీనియర్, సినారె, ఆరుద్ర, ఆత్రేయ, దాశరథి, కొసరాజు, వేటూరి వంటి వారందరినీ తనలో జీర్ణించుకుని పాటకు కొత్త రాగ పరిమళాన్ని, గాన సౌరభాన్ని అద్దిన 'సిరివెన్నెల' నిస్సందేహంగా వెండితెరకు వెండివెన్నెల..మన సిరివెన్నెల! శాస్త్రిగారి పాటల వేణుగానాన్ని విని, మురిసి ముగ్ధులైన న్యాయమూర్తులు నందుల్ని బహుమతులుగా ఇవ్వడం ఎంతైనా విశేషం. ఆ పాటల్ని రసరమ్యంగా గానం చేసి, వీనులకు విందు చేసిన నేపథ్యగాయకులు ఎస్.పి బాలసుబ్రహ్మణ్యం, సుశీల, చిత్ర, జానకి తదితరులకు మనం కృతజ్ఞతలు చెల్లించాల్సిందే. వారిచేత గొప్ప పాటలు రాయిం చిన దర్శక, నిర్మాతలను అభినందించాల్సిందే!..

ఇవాళ సినిమాల్లో భాషా దారిద్ర్యం, భావ దారిద్ర్యం రాజ్యమేలుతున్నాయి. అర్థం లేని సంగీతం వెగటు కల్గిస్తోంది. ఈ తరుణంలో సిరి వెన్నెల గీతాలు రాబోయే తరానికి 'పెద్దబాలశిక్ష' వంటివి. స్నిగ్ధ సుకుమారమైన పదాలను వెతు క్కునేందుకు నిఘంటువులా ఉపకరిస్తాయి. ఒక్క మాటలో చెప్పా లంటే తెలుగు వెండితెరపై సిరివెన్నెల సంతకం చెరగ నిది. వారి చిరునవ్వులా!..తలలో సిరిపువ్వులా!...

ప్రఖ్యాత కవి డా.నాగభైరవ గారికి సినిమా రంగంతో ఉన్న అనుబంధం దృష్ట్యా 'డా. నాగభైరవ కవితా పురస్కారానికి' సిరివెన్నెల అక్షరాలా అర్హులే! అలుపెరగని సిరివెన్నెల పసిడి కలానికి...ఈ సందర్భంగా శుభాకాంక్షలు.

ఈ నెల 11వ తేదీన సాయంత్రం 6.05 గంటలకు నెల్లూరు పురమందిరంలో జరిగే డా. నాగభైరవ అవార్డు ప్రదానోత్సవ సభలో సిరివెన్నెల, డా. నాగభైరవ అవార్డును అందుకోనున్న సందర్భంగా...



- డాక్టర్ బీరం సుందరరావు
ఇంకొల్లు. ఫోన్: 98480 39080

# వెనక్కు తగ్గిన మేయర్!



నెల్లూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం 6వ తేదీ కౌన్సిల్ సమావేశ మందిరంలో వాడివేడిగా జరిగింది. ముఖ్యంగా కార్పొరేటర్లు పార్టీల వారీగా కంటే మేయర్ అనుకూల, మేయర్ వ్యతిరేక వర్గాలుగా మారి పలు అంశాలపై వాదోప వాదాలకు దిగారు. నెల్లూరులోని నిప్పో ఫ్యాక్టరీకి చెందిన 13.2 ఎకరాల ల్యాండ్ కన్వర్షన్‌కు సంబంధించిన అంశాన్ని అజెండాలో చేర్చారు. అలాగే నెల్లూరు కలెక్టరేట్ ప్రాంతంలోని ఓ మున్సిపల్ స్కూల్ భవనాన్ని కూడా ఒకేషనల్ ట్రైనింగ్ కోర్సు నిమిత్తం వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్‌కు అప్పగించే అంశాన్ని కూడా అజెండాలో పొందుపరచడం జరిగింది. మొత్తం 24 అంశాలతో సమావేశంలో అజెండాను ప్రవేశపెట్టగా విపక్ష వైకాపా కార్పొరేటర్లతో పాటు అధికారపక్షానికి చెందిన మేయర్ అజీజ్ వ్యతిరేక కార్పొరేటర్లు కూడా ఈ రెండు అంశాలను బలంగా వ్యతిరేకించారు. దీంతో మేయర్ కిక్కురుమనకుండా ఈ రెండు అంశాలలో నిప్పో ల్యాండ్ కన్వర్షన్ అంశాన్ని అజెండా నుండి ఉపసంహరించగా, మున్సిపల్ స్కూల్ భవనాన్ని అప్పగించే అంశంలో కొంచెం మార్పు చేశారు. మేయర్ అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీడీపీ, వైకాపా, బీజేపీ, సీపీఎం కార్పొరేటర్లు తమదైన శైలిలో విరుచుకుపడ్డారు.



వాదులాడుకుంటున్న వైసిపి, టీడీపీ కార్పొరేటర్లు

## ఆస్ట్రేలియా ప్రొఫెసర్ చెన్నుపాటికి
# నాయుడమ్మ అవార్డ్



డాక్టర్ చెన్నుపాటి జగదీష్

నెల్లూరులోని నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్ సంస్థ ప్రతి యేటా అందించే ప్రతిష్టాత్మక నాయుడమ్మ అవార్డును ఈ సంవత్సరం ఆస్ట్రేలియా నేషనల్ యూనివర్శిటీ, కాన్‌బెర్రాలో విశిష్ట ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ చెన్నుపాటి జగదీష్‌కు ప్రదానం చేస్తున్నట్లు సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఎ.జగదీష్ తెలిపారు. డాక్టర్ చెన్నుపాటి ఢిల్లీ విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పొందారు. వీరు సెమీ కండక్టర్ ఆప్టో ఎలక్ట్రానిక్స్ మరియు నానో టెక్నాలజీలో విశేష కృషి చేశారు. ఐఈఈఈ ఫోటోనిక్స్ సొసైటి ప్రెసిడెంట్, ఎడిటర్-ఇన్-చీఫ్ ప్రోగ్రెస్ ఇన్ క్వాంటమ్ ఎలక్ట్రానిక్స్ మొదలైన సంస్థలలో డాక్టర్ చెన్నుపాటి సభ్యత్వం కలిగిఉన్నాడు. చెన్నుపాటి 870కి పైగా పరిశోధనా పత్రాలు ప్రచురించారు. అమెరికాలో 5 పేటెంట్లతో పాటు, 11 పుస్తకాలు ప్రచురించారు. ఇన్నేళ్ళుగా ఆయన చేసిన విశేష సేవలకు గుర్తింపుగానే ఈ అవార్డును జూన్ మొదటివారంలో నెల్లూరులో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ప్రదానం చేయనున్నారు. ఈ ప్రతిష్టాత్మకమైన నాయుడమ్మ అవార్డును గతంలో డా॥ కె.కస్తూరి రంగన్, డా॥ ద్రోణంరాజు కృష్ణారావు, డా॥ పి.రామారావు, డా॥ పి.రామచంద్రరావు, డా॥ ఆర్.నటరాజన్, డా॥ కిరిత్ ఫారిక్, డా॥ వి.ఎస్.రామ్మూర్తి, డా॥ అనిల్ కడోట్కర్ వంటి గొప్ప శాస్త్రవేత్తలు అందుకొని వుండడం విశేషం!

# మా బాబు నిప్పు... మీదే తప్పు

## - వైకాపాపై బీద ధ్వజం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

మా నాయకుడు చంద్రబాబునాయుడు నిప్పులాంటి మనిషి, ఆయన ఆలోచన, వేసే అడుగు అంతా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసమే. ఇంతకాలం కేంద్రంతో సర్దుకుంటూ వచ్చింది కూడా రాష్ట్రానికి నిధుల కోసమే. రాష్ట్రంపై చంద్రబాబుకున్న ప్రేమ, శ్రద్ధను శంకించే అర్హత ఎవరికీ లేదని టీడీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పేర్కొన్నారు. ఈ నెల 6వ తేదీన నెల్లూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఇంత అన్యాయం జరిగినా ఇంత వరకు ప్రశ్నించని నాయకుడు జగన్మోహన్ రెడ్డేనన్నారు. రాష్ట్రం కోసం చంద్రబాబు పోరాడుతుంటే, ప్రతిపక్ష నేత జగన్మోహన్ రెడ్డి మాత్రం బీజేపీ నాయకులను ప్రసన్నం చేసుకోవడానికి దొంగ నాటకాలాడుతున్నాడు. పలుమార్లు ప్రధానిని కలిసిన వైకాపా నాయకులు రాష్ట్రానికి రావాల్సిన నిధులను అడ్డుకుంటున్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని అడ్డుకునే ఇలాంటి ప్రతిపక్షాన్ని తాను ఏ రాష్ట్రంలోనూ చూడలేదని ఈ సందర్భంగా బీద పేర్కొన్నారు. ఈ సమావేశంలో నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, విజయడెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ కోదూరు కమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

# విజయవంతంగా ప్రజాసంకల్ప యాత్ర

## - వై.యస్.వివేకా



నెల్లూరుజిల్లాలో వైయస్సార్సీపీ అధ్యక్షుడు ప్రతిపక్షనేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర విజయవంతంగా కొనసాగుతోందని మాజీమంత్రి, వైయస్సార్సీపీ జిల్లా పార్టీ సమన్వయకర్త వై.యస్.వివేకానందరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 5న నెల్లూరు దర్గామిట్టలోని ఓడూరు సుధీర్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వాటికి సరైన పరిష్కారం చేయాలనే సంకల్పంతో ప్రజాసంకల్పయాత్రను వై.యస్.జగన్మోహన్‌రెడ్డి చేపడుతున్నారన్నారు. మాటమీద నిలబడే వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన వెంట ప్రతిఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. రాజన్న రాజ్యం జగన్‌తోనే సాధ్యమవుతుందన్నారు. ఈ సమావేశంలో వైయస్సార్సీపీ నాయకులు ఎం.జగన్, గంగిరెడ్డి, ఓడూరు సుధీర్‌రెడ్డి, సిహెచ్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# మెట్టలో రైలు కూత వినేదెప్పుడు?



*ఇప్పుడు నలభై ఐదేళ్ల వయసులో వున్నోళ్ళు వారి చిన్నప్పటి నుండి ఒక మాట వింటూనే వుండుంటారు. అదే వెంకటగిరి-నడికుడి మధ్య రైల్వేలైన్ వస్తుందని, మన రాపూరు, ఆత్మకూరు, వింజమూరు, దుత్తలూరుల మీదుగా రైలు పోతుందని. అప్పటి నుండి వింటున్నాం... ఇప్పుడూ వింటున్నాం... ఇంకో పాతికేళ్ల తర్వాత కూడా ఇదే మాటను వింటుంటాం...*

ఈ రైల్వేలైన్‌కు వాస్తుదోషమో ఇంకేదన్నా లోపమో గాని ఒకడుగు ముందుకు వేస్తే పది అడుగులు వెనక్కు వేస్తుంది. గతంలో యూపిఏ ప్రభుత్వమైనా, నేటి ఎన్డీఏ ప్రభుత్వమైనా ఈ రైల్వేలైన్‌పై సవతి ప్రేమనే చూపిస్తున్నాయి తప్పితే పూర్తి చేయాలన్న చిత్తశుద్ధి చూపడం లేదు. ఈ రైల్వేలైన్‌ను సర్వేలకు పరిమితం చేయడం, అరకొర నిధులు విదిల్చడం చేస్తున్నారు. ఈ బడ్జెట్‌లోనూ ఈ లైన్‌కు కేవలం 420కోట్ల నిధులే మంజూరు చేయడాన్ని చూస్తుంటే ఇప్పటిప్పట్లో ఇది పూర్తి కావడం అసాధ్యమనిపిస్తోంది.

చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో దాదాపు 30మండలాల ప్రజలకు ఈ రైల్వేలైన్ ఉపయోగపడుతుంది. ఈ మూడు జిల్లాల్లో మెట్టప్రాంతాల నుండి హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, చెన్నై వంటి నగరాలకు ప్రయాణ అనుసంధానం ఏర్పడుతుంది. తుఫాన్‌లు, వరదల సమయంలో చెన్నై-విజయవాడ రైల్వేలైన్ దెబ్బతిని రైళ్ళ రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంటుంది. అలాంటి సందర్భాల్లో ఈ రైల్వేలైన్ ప్రత్యామ్నాయ రైలు మార్గంగా ఎంతో బాగా పనికొస్తుంది. వ్యాపార, వాణిజ్య, ప్రయాణీకుల ఆదాయ పరంగా కూడా ఈ రైల్వేలైన్‌కు చక్కని అవకాశాలున్నాయని సర్వేలలోనూ తేలింది. మరి ఇంతటి ఉపయోగమున్న, ప్రాధాన్యత కలిగిన రైల్వేలైన్‌ను కేంద్రం ఎందుకు అశ్రద్ధ చేస్తున్నట్లు?



## 'ప్రభా'తం

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచెయ్యే చూపారు. కీలకమైన మిత్రపక్షంగా ఉన్నప్పటికీ ఈ బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎలాంటి ప్రాధాన్యత దక్కలేదు. ఈ బడ్జెట్‌లోనైనా కరువుదీరా నిధులు వస్తాయని ఆశించిన ఆంధ్రరాష్ట్రానికి శూన్యహస్తమే మిగిలింది. కళ్ళు కాయలు గాచేలా ఎదురుచూస్తున్న ఆంధ్రుల ఆశలన్నీ అడియాసలయ్యాయి. ప్రస్తుతం ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం ఈ దశలో ప్రవేశపెట్టే చివరి, పూర్తిస్థాయి బడ్జెట్ కావడంతో రాష్ట్రానికి తగినన్ని నిధులు దక్కుతాయని అందరూ ఆశించారు. కానీ, కేంద్ర బడ్జెట్ దేశవ్యాప్తంగా ప్రజల ఆకాంక్షలు ప్రతిఫలిస్తూ అందరిలో ఆశల మోసులెత్తించేదే అయినప్పటికీ, విభజనతో గాయపడ్డ మన రాష్ట్రానికి మాత్రం పూర్తిస్థాయి నిధుల మాట ఆకాశ పుష్పమే అయింది. బాగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు ఇచ్చిన ప్రాధాన్యతలో కనీసం పదోవంతు కూడా ఆర్థికంగా వెనుకబడిన ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వకపోవడం పట్ల అటు ప్రభుత్వంలోనూ, ఇటు ప్రజల్లోనూ తీవ్రమైన ఆవేదన కలుగుతోంది. రాష్ట్రానికి సంబంధించిన ప్రధానమైన ప్రాజెక్టుల విషయం కానీ, ముఖ్యమైన ప్రజోపయోగ పనుల నిధుల ప్రస్తావన గానీ, విభజనతో అష్టకష్టాల పాలైన ఆంధ్రరాష్ట్రాన్ని ఆదుకుందామన్న ప్రయత్నం కానీ అరుణ్‌జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్ నిధుల కేటాయింపులో కనపడక పోవడంతో రాష్ట్రమంతటా నిరాశా మేఘాలు ఆవరించాయి. రాష్ట్రప్రభుత్వం పదేపదే కోరుతున్న ఒక్క ప్రాజెక్టుకు కూడా గ్రీన్‌సిగ్నల్ పడలేదు. కోరుకున్న ఒక్క పనీ జరగ లేదు. ఎంతోకాలం నుంచి కోరుకుంటున్న ప్రధాన ప్రాజెక్టులను సైతం బడ్జెట్లో ఖాతరు చేయకపోవడంతో అందరూ డీలా పడిపోయారు. కనీసం కొన్ని విన్నపాలకైనా కేంద్రం స్పందించి ఉంటే బావుండేదని, దీర్ఘకాలిక ప్రయోజనాలిచ్చే ప్రాజెక్టులకైనా అంగీకారం తెలిపివుంటే సంతోషంగా ఉండేదని, కేంద్రబడ్జెట్లో రాష్ట్ర ప్రయోజనాలను పూర్తిగా విస్మరించారనీ పాలకపక్షమైన టిడిపి వర్గాల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. విభజనతో నానా కష్టాలు పడుతూ, రాజధాని కూడా లేని పరిస్థితుల్లో రాష్ట్రం ఎలాగో తట్టుకుని నిలబడేందుకు నానాయాతనలు పడుతోంది. ఈ పరిస్థితుల్లో ఆర్థికసమస్యల సుడిగుండంలోంచి రాష్ట్రాన్ని బయటపడేసేందుకు, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపేందుకు తగు చేయూతనందించాలని కోరుతున్నా బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపడమే అందరికీ బాధనుకలిగిస్తోంది. మిత్రధర్మాన్ని ధర్మబద్ధంగా పాటిస్తున్నా రాష్ట్రానికి రిక్తహస్తమే మిగిలిందనే నిరాశ టిడిపి నేతలను అసంతృప్తికి గురిచేస్తోంది. రాజధానికి ఈ బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడం, విశాఖపట్నం కేంద్రంగా ప్రత్యేక రైల్వేజోన్ ఏర్పాటుచేయాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో ఈసారి కూడా ఆంధ్రకు అన్యాయమే జరిగిందనే బాధ సర్వత్రా వ్యక్తమవుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో తీరప్రాంత ఉపాధి మండలి (కోస్టల్ ఎంప్లాయిమెంట్ జోన్) ఏర్పాటుచేస్తామన్న ప్రతిపాదనలకు నేటికీ ఒక కొలిక్కిరాకపోవడం బాధాకరం. ఎగుమతులను ప్రోత్సహించేందుకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తూర్పుతీరంలోని ఆంధ్రప్రదేశ్‌లో, పశ్చిమతీరంలోని గుజరాత్‌లో ఈ జోన్లు ఏర్పాటుచేస్తామని నీతి ఆయోగ్ ప్రకటించివున్నా బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే లేదు. ఒకవైపు మహారాష్ట్ర, కర్నాటకల్లో సబర్బన్ రైలుప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించడం, ఆంధ్రరాష్ట్రంలోని విశాఖ, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టుల ఊసెత్తకపోవడం ఎంతో బాధాకరమని టిడిపి ఆవేదన వ్యక్తం చేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సైతం కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రంలోని ప్రాజెక్టులకు ఆశించిన నిధుల కేటాయింపులు లేకపోవడం పట్ల ఆవేదనతో ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఢిల్లీ వంటి రాజధాని నగరాన్ని నిర్మించేందుకు సహకరిస్తామని స్వయంగా ప్రధాని మోడీ గతంలో హామీ ఇచ్చివున్నా, రాజధాని నిర్మాణం కోసం మరో వెయ్యికోట్లు ఇస్తామని కేంద్రం హామీ ఇచ్చినా..తాజా బడ్జెట్‌లో మాత్రం వాటి ఊసే లేదు. రాజధాని అమరావతికి సంబంధించి రైల్వే అనుసంధానానికి రెండు ప్రాజెక్టుల ప్రతిపాదనలు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. కేంద్రం ఆ ప్రాజెక్టులకు సంబంధించిన మొత్తం నిధులను కేటాయించి, రైల్వేలైన్ల పనులు పూర్తిచేయాలని రాష్ట్రం కోరుతున్నా ఆ ప్రతిపాదనలకు నేటికీ ఆమోదం లేదు. బడ్జెట్‌లో అసలు ఆ ప్రస్తావనలే లేవు. గిఫ్ట్ సిటీ కింద అహ్మదాబాద్‌కు ఇచ్చిన ప్రోత్సాహకాలు అమరా వతికి ఇచ్చివుంటే బావుండేదనే అభిప్రాయం అంతటా వ్యక్తమవుతోంది. విభజనతో రాష్ట్రానికి ఏర్పడే రెవెన్యూలోటును భర్తీ చేస్తామని విభజన సమయంలో అప్పటి ప్రధాని హామీ ఇచ్చారు. అయినా ఆ హామీలేమీ నెరవేరలేదు. దీంతో ఆశలన్నీ ఆవిరయ్యాయి.2014-15 సంవత్సరానికి ఆ లోటు 16,078 కోట్లు అయితే, ఇప్పటికీ కేంద్రం 3,970 కోట్లు మాత్రమే ఇచ్చింది. మిగతా మొత్తాన్ని విడుదలచేసి రాష్ట్రాన్ని ఆదుకోవాలని పదేపదే విజ్ఞప్తులు చేస్తూ ఉన్నా కేంద్రం నుంచి తగు స్పందన ఉండడం లేదని, విభజనతో అన్యాయానికి గురైన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధిపథంలో నడిపించేందుకు కేంద్రం తగు చొరవతో శ్రద్ధ చూపితే ఎంతో సంతోషించేవారమని, అయితే, కేంద్రం ఆశించిన స్థాయిలో పట్టించుకోకపోవడంతో రాష్ట్ర విభజన సమయంలో రాష్ట్రం పరిస్థితి ఎలా ఉందో ఇప్పటికీ ఆ సమస్యలే కొనసాగుతున్నాయని టిడిపి నేతలు విచారం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆర్థికపరిస్థితి మెరుగుపడలేదని, నామమాత్రపు నిధులు, కంటితుడుపు కేటాయింపులతో సమస్యలు పరిష్కారం కావని విభజన చట్టంలో ఇచ్చిన హామీలను నెరవేర్చినప్పుడే సమస్యలకు పరిష్కారం దక్కుతుందని టిడిపి నేతలు భావిస్తున్నారు. కేంద్రం దృష్టికి తాము పలుసార్లు తీసుకువెళ్ళిన సమస్యలను, అంశాలను కేంద్రం ఇకనైనా సానుభూతితో పరిశీలించి పరిష్కరించాల్సి ఉందని అందరూ కోరుకుంటున్నారు. ఆశించిన నిధులందక ఆంధ్రప్రదేశ్ అనేక ఇబ్బందులు పడుతూనే ఉంది. ఒక్క పోలవరం విషయంలో తప్ప మిగిలిన అంశాల్లో ఆంధ్రకు తగు న్యాయం జరగడం లేదు. ప్రత్యేకహోదా లేదు..ప్రత్యేక ప్యాకేజీ కూడా ఆశించినరీతిలో రాలేదు. ఇప్పటికైనా కేంద్రం ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాన్ని రెండుచేతులా ఆదుకునేందుకు ముందుకు రావాల్సి ఉంది. నవ్యాంధ్ర ప్రగతిపథంలో పయనించేందుకు తగు చేయూతను అందించాల్సి ఉంది.

### బడ్జెట్ రగిల్చిన చిచ్చు

**కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచెయ్యే చూపారు. కీలకమైన మిత్రపక్షంగా ఉన్నప్పటికీ ఈ బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎలాంటి ప్రాధాన్యత దక్కకపోవడం విచారకరం. కేంద్రబడ్జెట్ దేశవ్యాప్తంగా ఒకటే అయినప్పటికీ, విభజనతో గాయపడ్డ మన రాష్ట్రానికి మాత్రం పూర్తిస్థాయి నిధుల మాట ఆకాశపుష్పమే అయింది. ఆశించినస్థాయిలో రాష్ట్రానికి ఎలాంటి కేటాయింపులు లేకపోవడంతో అందరిలోనూ నిరాశే ఎదురైంది. ఈ బడ్జెట్‌లో కూడా ఆంధ్రకు అన్యాయమే జరిగిందనే బాధ సర్వత్రా వ్యక్తమవుతోంది.**

## ధ్యానం, యోగా ద్వారా కాన్సర్ నయం

**- సెట్నల్ సి.ఇ.ఓ డాక్టర్ సుబ్రహ్మణ్యం**

ధ్యానం, యోగా ద్వారా కాన్సర్ లాంటి రోగాలు నయమవుతాయని సెట్నల్ సి.ఇ.ఓ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈనెల 4న నెల్లూరు ఆదిత్య డిగ్రీ కళాశాలలో వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులతో మాట్లాడారు. యోగా సాధన చేసేవారికి మానసికంగా, శారీరకంగా ఆరోగ్యం బాగుంటుందన్నారు. దీంతోపాటు సాత్విక ఆహారం తీసుకుంటే మంచి నడవడిక అలవడుతుందన్నారు. స్వామి వివేకానంద లాంటి వారు ధ్యానం, యోగా సాధనతో ఏకసంతాగ్రాహిగా మారారన్నారు. గుట్కా, పొగాకు పదార్థాలకు దూరంగా వుండి కొన్ని రకాల క్యాన్సర్ల నుండి రక్షించుకోవాలన్నారు. అనంతరం సూర్య నమస్కారాల శిక్షణను అందించిన యోగా శిక్షకులకు ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా డియస్‌డిఒ రమణయ్య, యోగా మిత్ర మండలి అధ్యక్షులు వెంకటరెడ్డి, ప్రధానకార్యదర్శి రవీంద్ర, యోగా మాస్టర్లు స్వప్న, పద్మ, పతంజలి యోగపీఠ్ అధ్యక్షులు విజయకుమార్‌రెడ్డి, ప్రసన్న, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న యోగాశిక్షకులు

### పొగాకు ఉత్పత్తులపై...
## పోలీసులకు అవగాహన

నెల్లూరులోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో ఈ నెల 3వ తేదీన యాన్యువల్ మొబిలైజేషన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో 150మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. పొగాకు, పొగాకు ఉత్పత్తుల గురించి, వాటి వల్ల జరిగే అనర్థాల గురించి తెలియజేశారు. పొగాకు వాడడం వల్ల గుండె జబ్బులు, పక్షవాతం, వివిధ రకాల క్యాన్సర్‌లు, ఆస్తమా, క్షయ, శ్వాసనాళ సంబంధము, పిల్లలు పుట్టకపోవడం, మధుమేహం వంటి వ్యాధులకు గురికావాల్సి వస్తుందన్నారు. పొగాకు ఉత్పత్తులపై ప్రచారం నిషేధం, మైనర్ పిల్లలకు పొగాకు ఉత్పత్తుల అమ్మకం లాంటి విషయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సైకాలజిస్ట్ సరస్వతి, సూపర్ వైజర్ షేక్‌జలీల్, హాసిని, ఎల్‌టి రాజేష్, భానుతేజ పాల్గొన్నారు.

## దివ్యాంగుల ఉపకరణాలకు దరఖాస్తులు

నెల్లూరుజిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు(వికలాంగులు) వారికి అవసరమైన ఉపకరణాలు(ట్రై సైకిళ్ళు, వీల్‌ఛైర్, చంక కర్రలు, కృత్రిమ అవయవాలు, శ్రవణయంత్రాలు, టచ్‌ఫోన్స్, ల్యాప్‌టాప్, డైసీ ప్లేయర్) కొరకు నెలసరి ఆదాయం రూ.15వేలలోపు కలవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వి.నాగరాజకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాల కొరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్, జిల్లా విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ కార్యాలయం, కొండాయపాళెం, వనంతోపులోగాని, 0861-2329581, 2348142 ఫోన్ నెంబర్లలో గాని సంప్రదించాలని కోరారు.




## ఏపికి రిక్త హస్తమే

విభజన ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు నాటి యూపిఏ ప్రభుత్వం చేసిన అన్యాయం కంటే నేడు ఎన్డీఏ ప్రభుత్వం చేస్తున్న అన్యాయమే ఎక్కువగా వుంది. యూపిఏ వాళ్ళు తమ రాజకీయ ప్రయోజనాల కోసం అప్పుడు నిలువునా ఏపి వాళ్ల గొంతు కోసారు. ఇప్పుడు ఎన్డీఏ ప్రభుత్వం అంతకంటే కసాయితనంగా వ్యవహరిస్తోంది. విభజన హామీలలో ఏ ఒక్క దానిని పట్టించుకోవడం లేదు. ప్రత్యేకహోదాకు పాతరేసారు. విశాఖ రైల్వేజోన్ ఊసు లేకుండా చేసారు. దుగరాజపట్నం పోర్టు మాటే లేదు. కేంద్రాన్ని నిలదీసే దమ్ము ధైర్యం లేని ముఖ్యమంత్రి మనకు దాపురించాడు. చంద్రబాబు 'ఓటు-నోటు' కేసు పాపానికి రాష్ట్రం సర్వనాశనమైపోయింది.

**ఎం.డి.జమీర్, నెల్లూరు.**

## కమ్యూనిస్టుల ఆఫీసుల్లో పెట్టుకోండి

టీటీడీలో అన్యమత ఉద్యోగులకు నోటీసులు జారీ చేస్తే వామపక్ష నాయకులు గగ్గోలు పెడుతున్నారు. వారిని అక్కడనుండి తొలగించవద్దంటూ ఆందోళనలు చేస్తున్నారు. వారి మీద మీకు అంత ప్రేమే ఉంటే వారికి మీ ఆఫీసుల్లో ఉద్యోగాలిచ్చుకోండి. అయినా అన్యమతస్థులను ఉద్యోగాల నుండి తీయడం లేదు కదా, వేరే చోట్ల వారికి పోస్టింగ్‌లు ఇస్తారు. వాళ్ళకేం అన్యాయం చేయడం లేదు. టీటీడీలో వుంటూ స్వామి సొమ్ము తింటూ ఇతర మతాల ప్రచారం చేసే ఇలాంటి ద్రోహులను తిరుమలలో ఎందుకు కొనసాగించాలి. టీటీడీ పూర్తిగా హిందూ ధార్మిక సంస్థ. అక్కడ ఆ మత సంస్కృతికే ప్రాధాన్యతనివ్వాలి.

**పి. శివాచారి, నాయుడుపేట.**

## దుబారా ప్రభుత్వం

మింగను మెతుకులేదు గాని మీసాలకు సంపెంగ నూనె అన్నట్లుగా మారింది చంద్రబాబు ప్రభుత్వ వ్యవహారం. అప్పులు రెండు లక్షల కోట్లకు దాటాయి. సింగపూర్ లాంటి రాజధాని అంటూ అరచేతిలో స్వర్గం చూపించారు. ఇంతవరకు తాత్కాలిక భవనాలు తప్పితే అక్కడ ఇంకేమీ లేదు. స్మార్ట్ సైకిళ్ళు అంటే ఒక్కో సైకిల్ ఒకటిన్నర లక్ష పెట్టి కొన్నారు. బాబు గారి డాంబికాలకు జనం సొమ్ము ఖర్చయిపోతుంది.

**నగేష్.జి, నెల్లూరు.**



# ఆర్యవైశ్యుల సభ అదిరింది

2014 ఎన్నికల్లో వైకాపా ఓటమికి నాలుగైదు ప్రధాన కారణాలుంటే అందులో ఒకటి వైశ్యులు, బ్రాహ్మణులు నూటికి 90మంది తెలుగుదేశంకు మద్దతుగా నిలవడం. కేవలం జగన్ కుటుంబం మీద సాగిన మతపరమైన దుష్ప్రచారం వల్లే ఈ రెండువర్గాలు జగన్‌కు దూరమయ్యాయి. అయితే ఈ నాలుగేళ్లలో తెలుగుదేశం ప్రభుత్వంపై వారిలో అసంతృప్తి పెరిగింది. గతంలో వై.యస్. హయాంలో ఈ రెండు వర్గాల వారి సంక్షేమానికి ఆయన ఎంతో చేశాడు. వై.యస్. మీదున్న ఆ నమ్మకం, అభిమానంతో మళ్ళీ ఆ వర్గాలకు చెందినవారు వై.యస్.జగన్‌ను నమ్ముతున్నారు.

ఈ క్రమంలోనే వైకాపాకు ఆర్యవైశ్యులను దగ్గర చేసే ఓ పెద్దప్రయత్నం నెల్లూరుజిల్లా నుండే మొదలైంది. నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్ ఈ ప్రయత్నానికి శ్రీకారం చుట్టి విజయం సాధించారు. ఈనెల 4వ తేదీన నెల్లూరురూరల్ మండలం నరసింహకొండలోని నారాయణ ఐఐటి క్యాంపస్ వద్ద ఏర్పాటు చేసిన జగన్‌తో ఆర్యవైశ్య ఆత్మీయ సదస్సుకు జిల్లా నలుమూలల నుండి వేల సంఖ్యలో ఆర్యవైశ్యులు హాజరయ్యారు. రాష్ట్ర ఆర్యవైశ్య ప్రముఖులు, ఎమ్మెల్సీ కోలగట్ల వీరభద్రస్వామి, మాజీఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్, వైసిపి రాజకీయ సలహామండలి సభ్యులు గుబ్బా చంద్రశేఖర్, చిప్పగిరి ప్రసాద్, కుప్పం ప్రసాద్ తదితరులు హాజరయ్యారు. ముక్కాల ద్వారకానాథ్ ఆధ్వర్యంలో నెల్లూరు, పప్పులవీధి నుండి ట్రంకురోడ్డు, కె.వి.ఆర్ పెట్రోల్‌బంకు, ఇరుకళల పరమేశ్వరి దేవాలయం మీదుగా సభాప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

ఈ ఆర్యవైశ్య ఆత్మీయ సభకు విచ్చేసిన వైసిపి అధినేత జగన్ తెలుగు జాతికి ప్రత్యేక రాష్ట్రం కోసం అసువులు



బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని వృధా కానివ్వమని, తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక చరిత్ర గర్భంలో కలిపేసిన నవంబర్ 1 ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని తిరిగి చరిత్ర పుటల్లోకి తెస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఆర్యవైశ్య నాయకులు తన దృష్టికి తెచ్చిన అన్ని సమస్యల మీద కూడా ఆయన సానుకూలంగా స్పందించారు. పార్టీలో ఆర్య వైశ్యులకు సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

ఆర్యవైశ్య ఆత్మీయ సదస్సును నెల్లూరు నుండే ప్రారంభించారు. అన్ని జిల్లా లోనూ ఈ సదస్సులు ఏర్పాటు చేయనున్నారు. రాజకీయంగా వైకాపాకు ఈ సదస్సులు మంచి మైలేజేనని చెప్పవచ్చు.









***1983లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించాక అప్పటి నుండి ఇప్పటివరకు నెల్లూరు లోక్‌సభకు 10సార్లు ఎన్నికలు జరిగాయి, 2012లో జరిగిన ఉపఎన్నికను కూడా కలుపుకుంటే! ఈ పదిసార్లలో తెలుగుదేశం పార్టీ గెలిచింది రెండంటే రెండుసార్లే! ఏ లోక్‌సభ స్థానంలో కూడా తెలుగుదేశం పార్టీకి ఇంత వరెస్ట్ రికార్డ్ ఉండదేమో! 1984లో తెలుగుదేశం అభ్యర్థిగా పుచ్చలపల్లి పెంచలయ్య గెలవగా, 1999లో వాజ్‌పేయి సానుభూతి గాలిలో ఉక్కాల రాజేశ్వరమ్మ గెలిచారు. నెల్లూరు లోక్‌సభ టీడీపీకి ఈ రెండే విజయాలు. 1989, 1992, 1996, 1998, 2004, 2009 ఎన్నికల్లో ఇక్కడ నుండి కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించగా 2012 ఉపఎన్నికల్లోనూ, 2014 ఎన్నికలలోనూ వైసిపి అభ్యర్థి గెలవడం తెలిసిందే!***

## టీడీపీ నుండి...

# లోక్‌సభకెవరో?

నెల్లూరు లోక్‌సభను గెలవడం అనేది తెలుగుదేశంకు ఒక పెద్ద పజిల్‌గా మారింది. అప్పటికీ 2014 ఎన్నికల్లో గట్టి అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డినే రంగంలోకి దించారు. ఆయన బాగానే ఓట్లు చీల్చాడు. సిటింగ్ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి మీదున్న వ్యతిరేకత వల్ల ఆదాలకు ఓట్లు పెరిగాయి. అయితే ఈ జిల్లాలో వై.యస్. అనుకూల పవనాలు మేకపాటిని కొద్దిపాటి మెజార్టీతో గట్టెక్కించాయి.

రాబోయే ఎన్నికల్లో వైకాపా నుండి లోక్‌సభకు సిటింగ్ ఎంపీగా మేకపాటి రాజమోహన్‌రెడ్డే బరిలోకి దిగుతాడా? లేక కొత్తవాళ్లెవరైనా దిగనున్నారా? అన్నది ఇంకా తేల్లేదు. అదే సమయంలో తెలుగుదేశం అభ్యర్థి ఎవరన్న ప్రశ్న కూడా వుంది. 2014 ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈసారి అసెంబ్లీకి పోటీ చేయాలనే ఆలోచనలో వున్నట్లు తెలుస్తోంది.

ఈసారి లోక్‌సభ పోటీ అంటే ఎన్ని కోట్లు ఖర్చో ఊహించవచ్చు. టీడీపీలో దీనికి సై అనే నాయకులెవరు? ఆదాల పోటీ చేయకుంటే బీద మస్తాన్‌రావు పేరు తెరపైకి రావచ్చు. చంద్రబాబు ఆదేశిస్తే నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలు కూడా బరిలోకి దిగే అవకాశాలున్నాయి. అయితే నెల్లూరు లోక్‌సభ అంటే డబ్బు ఖర్చే కాదు... గెలుపు కూడా గ్యారంటీ వుండదు. 2014 ఎన్నికల్లో కనీసం మేకపాటి మీద వ్యతిరేకతన్నా వుండింది. ఈసారి ఆ ప్రభావం కంటే కూడా ప్రభుత్వ వ్యతిరేకత ప్రభావమే ఎక్కువగా ఉండబోతోంది. కాబట్టి నెల్లూరు లోక్‌సభ నుండి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేయడం అంటే పెద్ద సాహసం చెయ్యడమే!




## ద్వితీయ వర్ధంతి

నిష్కల్మషి, నిస్వార్ధసేవాతత్పరుడు, నిరంతర ప్రజాసేవకుడు

## చిట్టమూరు పద్మనాభరెడ్డి గారు

(మాజీ వైస్‌ఛైర్మెన్, జిల్లా ప్రజాపరిషత్, నెల్లూరుజిల్లా)

పరమపదించి తేది. 9.2.2018 నాటికి రెండేళ్ళు గడిచాయి.

వారి దివ్యస్మృతికి అంజలి ఘటిస్తూ...

భార్య - చిట్టమూరు అనసూయమ్మ
బావమరిది - డా॥ చిల్లకూరు మోహన్‌రెడ్డి, చెన్నై
అల్లుడు - ప్రొ॥ సి.యం.కె.రెడ్డి, చెన్నై
కుమార్తె - చిల్లకూరు నిర్మల
కోడలు - డా॥ చిట్టమూరు భారతి, చెన్నై
మనుమడు - డా॥ చిల్లకూరు కిషోర్, చెన్నై
మనుమరాలు - కొవ్వూరు హారిత, కాకినాడ
మనుమరాలు - చిట్టమూరు ప్రణీత, USA
మనుమడు - చిట్టమూరు లోహిత్, చెన్నై

దాడులతో సరి...

# మారరే మరి?



నెల్లూరు ఏ.సి కూరగాయల మార్కెట్... తూకాలలో నిలువెత్తు మోసం... రెండు కిలోల టమోటాలు 20 రూపాయలంటారు... అక్కడ కొని ఇంకో చోట తూకం వేస్తే ఒకటిన్నర కిలో కూడా వుండవు. ఏ కూరగాయలైనా కనీసం అరకేజీ తీసుకోవాలి. పావుకిలో అడిగిన వాళ్ళను చాలా చీప్‌గా చూస్తారు. కూరగాయలు ఏరుకోవడం అసలే వుండదు. ఎవరన్నా మంచివి ఏరుకుందామని గంపల్లో చేతులు పెడితే పురుగును విదిల్చినట్లు విదిలిస్తారు. ఇష్టముంటే కొనండి, లేకుంటే పోండి అన్నట్లు ఈసడించుకుంటారు. గతిలేక ఇక్కడ కూరగాయలు కొనాల్సిందే!

గతంలో ప్రభుత్వం నగరంలో రెండు చోట్ల రైతుబజార్‌లను ఏర్పాటు చేసినా అక్కడ అన్నిరకాల కూరగాయలు దొరికే పరిస్థితి లేకపోవడంతో కాలక్రమేణ అవి మూతపడ్డాయి. ఏ.సి కూరగాయల మార్కెట్టే కింగ్ అయ్యింది.

ఇక్కడ తూకాల మోసాలు, నకిలీ లైసెన్స్‌లపై ఎన్నోసార్లు కలెక్టర్, జేసీ, తూ.కో శాఖాధికారులు దాడులు చేసారు. ఎన్నో అక్రమాలను వెలుగులోకితెచ్చారు. తూకాల్లో తేడాలను తేల్చారు. ఒకరి లైసెన్స్‌లతో ఇంకొకరు వ్యాపారం చేయడం గుర్తించారు. వ్యాపారులకు హెచ్చరికలు చేశారు. అయినా ఏం లాభం... మార్కెట్‌లో మోసాలు ఆగిందెప్పుడు? మొన్న కూడా ప్రకాశం, నెల్లూరు జిల్లాల తూనికలు కొలతల శాఖాధికారులు ఏ.సి మార్కెట్‌లో భారీఎత్తున దాడులు నిర్వహించారు. కాటాల్లో మోసాలు, తూకాల్లో తేడాలు గుర్తించారు. అయినా ఏం లాభం... మార్కెట్‌లో మోసాలు ఆగేది లేదు... వినియోగదారులకు న్యాయం జరిగేదీ లేదు.

మైక్రో బయాలజీ సొసైటి

## అధ్యక్షుడిగా శ్రీనివాసులురెడ్డి



ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల మెడికల్ మైక్రోబయాలజీ చాప్టెర్ అధ్యక్షుడిగా నారాయణ మెడికల్ కళాశాల మైక్రో బయాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ పలుకూరి శ్రీనివాసులు రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జనవరిలో జరిగిన 21వ ఉమ్మడి రాష్ట్రాల సదస్సును విజయవంతంగా నిర్వహించారు. శ్రీనివాసులురెడ్డిని అధ్యక్షుడిగా నియమిస్తూ ఈ నెల 3వతేదీన ఉత్తర్వులు జారీ చేసారు. నెల్లూరుజిల్లా వాసిగా 20ఏళ్ళకుపైగా మెడికల్ మైక్రో బయాలజిస్ట్‌గా ప్రజలకు సుపరిచితుడైన డాక్టర్ శ్రీనివాసులురెడ్డిని నారాయణ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీరనాగిరెడ్డి, కో-ఆర్డినేటర్ డాక్టర్ విజయ్‌కుమార్‌లు అభినందించారు.

శ్రీ రంగనాథుని బ్రహ్మోత్సవాలకు

## స్థంభ ప్రతిష్ట



నెల్లూరు రంగనాయకులపేటలో వేంచేసియున్న శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 25వ తేదీ నుంచి జరగనున్న శ్రీ స్వామివారి బ్రహ్మోత్సవాలకు సూచికగా ఈ నెల 5న దేవస్థానం ఆవరణంలో స్థంభ ప్రతిష్టాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మెన్ మంచికంటి సుధాకరరావు, ఇ.ఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి, ఆలయ అర్చకులు, దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

## పోలీసుల సొసైటి డైరెక్టర్ల ఎన్నిక 18న

నెల్లూరుజిల్లా పోలీసు ఉద్యోగుల సహకార పరపతి సొసైటికి చెందిన 10మంది మేనేజింగ్ కమిటిసభ్యుల పదవీకాలం పూర్తయినందున జిల్లా కలెక్టర్ 10మంది డైరెక్టర్ల పదవులకు ఎన్నికలు జరిపేందుకు సబ్‌డివిజనల్ సహకార శాఖ అధికారి ఎస్.అంకయ్యను ఎన్నికల అధికారిగా నియమించారు. ఈ నెల 4న నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. నామినేషన్లను ఈ నెల 11న ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు నెల్లూరు దర్గామిట్ట జిల్లా పోలీసు ఆఫీసులోని సొసైటి కార్యాలయంలో స్వీకరిస్తారు. 18వ తేదీ ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు రహస్య బ్యాలెట్ పద్ధతిన పోలీసుపరేడ్ గ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ సమావేశ మందిరంలో ఎన్నిక నిర్వహిస్తారని ఎన్నికల అధికారి ఎస్.చిన్నఅంకయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓటర్ల జాబితాను సొసైటి కార్యాలయంలోని నోటీసుబోర్డులో ఉంచినట్లు తెలిపారు.

## డిఎస్పీల నియామకం

నెల్లూరు పోలీస్ ట్రైనింగ్ కాలేజీ డిఎస్పీగా ఎన్.సూర్యచంద్రరావును నియమించారు. ఇక్కడ డిఎస్పీగా పనిచేస్తున్న ఏ.వి.చంద్రశేఖర్‌రావు ఇటీవలే రిటైర్డ్ అయ్యారు. ఆయన స్థానంలో డిజిపి ఆఫీసులో వెయిటింగ్‌లో వున్న సూర్యచంద్రరావును నియమించారు. అలాగే నెల్లూరు సిఐడి డిఎస్పీగా డిజిపి ఆఫీసులో వెయిటింగ్‌లో వున్న బి.శ్రీనివాస్‌ను నియమించారు. ఇక్కడ డిఎస్పీగా వున్న సయ్యద్ ముస్తాఫాను డిజిపి కార్యాలయానికి బదిలీ చేశారు. గతంలో గూడూరు డిఎస్పీగా వున్న బి.శ్రీనివాస్‌ను బెట్టింగ్ కేసుల నేపథ్యంలో విఆర్‌లో వుంచడం తెలిసిందే!

రూరల్ సిఐగా

## శ్రీనివాసరెడ్డి



నెల్లూరు రూరల్ సి.ఐగా బి.శ్రీనివాసరెడ్డి ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సి.ఐగా వున్న దుర్గాప్రసాద్‌ను విఆర్‌కు బదిలీ చేశారు. శ్రీనివాసరెడ్డి ఇటీవల కాలం వరకు గూడూరురూరల్ సి.ఐగా పనిచేస్తూ కొంతకాలంగా విఆర్‌లో వున్నారు. గతంలో ఎస్‌ఐగా జిల్లాలో పలు స్టేషన్‌లలో పని చేశారు.

ఔట్‌సోర్సింగ్

## పోస్టులకు ఆహ్వానం

నెల్లూరుజిల్లాలోని వివిధ కార్యాలయాల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేయుటకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సింహపురి భవిత సెట్విల్ సిఇఓ డా॥ సి.సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సైనోగ్రాఫర్, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎగ్జామిన్, కాపీయిస్టు, ప్రాసెస్ సర్వర్స్, అటెండెర్స్ ఉద్యోగాలకు అర్హత కలిగిన అభ్యర్ధులు పూర్తి వివరాలతో సింహపురి భవిత వెబ్‌సైట్‌లో ఈనెల 10వ తేదీ రాత్రి 8గంటలలోగా నమోదు చేసుకోవాలని కోరారు. అభ్యర్ధులు ఒక ఉద్యోగానికే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

# నెల్లూరు కబుర్లు

## చంద్రబాబు రావచ్చు



ఈనెల 21వతేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనకు వచ్చే అవకాశాలున్నాయి. ఆరోజు తడ మండలం మాంబట్టు సెజ్‌లో భారత్ ఫోర్జ్ కంపెనీ ఏర్పాటు చేయనున్న ఆటోమొబైల్ విడిభాగాల పరిశ్రమకు ఆయన శంకుస్థాపన చేస్తారు. ఈమేరకు కంపెనీ ప్రతినిధులు ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. అయితే సీఎం కార్యక్రమం ఇంకా అధికారికంగా ఖరారు కావాల్సి వుంది.

## నారాయణలో తరుణ్ సందడి

'నువ్వేకావాలి' ఫేమ్ తరుణ్ 6వ తేదీ నెల్లూరొచ్చాడు. నారాయణ ఇంజనీరింగ్ కాలేజీలో హాబీ క్లబ్ ఏర్పాటు చేసిన విద్యార్థులతో ముఖాముఖీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నాడు. తాను హీరోగా నటించిన 'ఇది నా లవ్‌స్టోరీ' సినిమా ఈ నెల 14వ తేదీన విడుదలవుతుందని, ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆయనకు పలు ప్రశ్నలు వేసారు. విద్యార్థులు ఆయనతో సరదాగా సెల్ఫీలు దిగారు.

## కాన్సర్ ఆసుపత్రికి లక్ష రూపాయల విరాళం



జేసీ ఇంతియాజ్ చేతుల మీదుగా విరాళం చెక్కున్న అందజేస్తున్న మహావీర్ జైన్ ట్రస్ట్ సభ్యులు

నెల్లూరు పొదలకూరురోడ్డులో వున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి కాన్సర్ ఆసుపత్రికి ఈ నెల 5న 'భగవాన్ మహావీర్ జైన్ చారిటబుల్ ట్రస్ట్' తరపున లక్ష రూపాయలు విరాళాన్ని నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ చేతుల మీదుగా కాన్సర్ ఆసుపత్రి నిర్వాహకులకు అందజేశారు. పేద రోగుల అన్నదానంకు ఈ విరాళాన్ని ఉపయోగించాలని దాతలు కోరారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి ఛైర్మెన్ ఏ.వి.సుబ్రహ్మణ్యం, జె.యస్.రెడ్డి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ టి.లక్ష్మి పాల్గొన్నారు.

## కిమ్స్‌లో మూర్ఛవ్యాధి వైద్యశిబిరం

నెల్లూరులోని కిమ్స్(బొల్లినేని) హాస్పిటల్‌లో అంతర్జాతీయ ఎపిలెప్సీ డే సందర్భంగా ఈ నెల 7 నుండి 15వ తేదీ వరకు ఉచిత మూర్ఛవ్యాధి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.గిరినాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రముఖ న్యూరోఫిజిషియన్ డా॥ డి.బాలఖాశిం ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఉదయం 9గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో కాలు, చేయి, శరీరంలో అనుకోని కదలికలు రావడం, పడిపోవడం, శరీరంలో ఏ భాగంలోనైనా మొద్దుబారినట్లు, జివ్వుమని లాగుతుండడం, వున్నట్లుండి తలనొప్పి రావడం, నీరసం, నిద్ర పట్టకపోవడం, తెలియకుండానే మల మూత్రాలు విసర్జించడం లాంటి సమస్యలతో బాధపడేవారు డాక్టర్ని సంప్రదించి ఉచిత వైద్యసలహాలను పొందవచ్చన్నారు. అవసరమైన అన్ని రకాల రక్త పరీక్షలు, సిటిస్కాన్, ఎంఆర్‌ఐ వైద్య పరీక్షలపై 50శాతం రాయితీ ఇవ్వబడుతుందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

## 10 నుండి సుందరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో ఉన్న శ్రీ సుందరేశ్వరస్వామి వారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈ నెల 10వ తేదీ నుండి 16వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయకమిషనర్, కార్యనిర్వహణాధికారి వేగూరు రవీంద్రరెడ్డి తెలిపారు. ఈ నెల 13వ తేదీ మంగళవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాత్రి ఒంటి గంటకు దివ్యాభరణ, విశేష పుష్పాలంకర శోభితులైన శ్రీ మీనాక్షి సమేత శ్రీ సుందరేశ్వరస్వామి వారికి వేదమంత్రోచ్ఛారణలతో మంగళవాయిద్యాలతో విశేష విద్యుద్దీపాలంకరణతో, తెనాలి తప్పెట్లు, తాళాలతో నగరోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుందన్నారు. ఉభయకర్తలుగా ఆల్తూరు ఆదినారాయణరెడ్డి కుటుంబసభ్యులు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ నెల 16వ తేదీ వరకు ప్రతిరోజూ విశేష అలంకారాలు జరుగుతాయన్నారు. ఈ పర్వదినాలలో భక్తులు విశేషంగా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



• నెల్లూరులో పోస్టింగా?

# వద్దంటే వద్దు!

## పోలీసు అధికారుల్లో భయం

*ఒకప్పుడు నెల్లూరులో పోస్టింగ్ అంటే ఎవరైనా ఎగిరి గంతేసేవారు. పైరవీలు చేసుకుని మరీ ఇక్కడకు పోస్టింగ్ చేయించుకుంటుంటారు. పోలీసు శాఖలో వారికి అయితే నెల్లూరులో పనిచేయడం చాలా ఇష్టం. ఇక్కడ నుండి కదలాలంటే కష్టం. ఇక్కడ టెర్రరిజం లేదు, రౌడీయిజం లేదు, నక్సలిజం లేదు... రాజకీయ నాయకుల యాక్షన్ తప్పితే ఫ్యాక్షన్ లేదు. పోలీసు శాఖపై అంతపెద్ద రాజకీయ ఒత్తిళ్లు కూడా ఏమీ వుండవు. పద్ధతిగా వుంటే చాలా ప్రశాంతంగా పనిచేసుకునిపోవచ్చు.*

అయితే ఇప్పుడు నెల్లూరుజిల్లాలో పోస్టింగ్ అంటే పోలీసు అధికారులు భయపడుతున్నారు. జిల్లా ఎస్పీ రామకృష్ణ పనిష్మెంట్ల దెబ్బకు డిఎస్పీలు, సి.ఐలు కూడా హడలిపోతున్నారు. డిపార్ట్‌మెంట్‌లో అవినీతి ఆరోపణలు, వివాదాలు వచ్చిన ఏ ఒక్క ఆఫీసర్‌ను కూడా ఆయన వదిలిపెట్టడం లేదు. జిల్లాకు వచ్చీరాగానే ఇద్దరు డిఎస్పీల మీద చర్యలు తీసుకున్నారు. ఇక సి.ఐలు, ఎస్.ఐలు, సిబ్బంది అయితే లెక్కేలేదు. ఏ సి.ఐ లేదా ఎస్.ఐ తప్పు చేసాడని తెలిసినా వెనువెంటనే చర్యలు చేపడుతున్నారు. పద్ధతిగా పనిచేసేవాళ్ళకు ఏ సమస్యా లేదు. కాని, పోలీసు శాఖలో నూటికి నూరుశాతం పద్ధతిగా పనిచేయడం కష్టమే! ఎస్పీ రామకృష్ణ ఆలోచనా తీరుకు తగ్గట్లుగా పనిచేయలేమని, వస్తే తమకూ పనిష్మెంట్ తప్పదనే ఉద్దేశ్యంతో చాలామంది అధికారులు నెల్లూరుకు రావడానికి జంకుతున్నారని తెలుస్తోంది.

# నాణ్యమైన విద్యే లక్ష్యం

## - పురపాలక శాఖ మంత్రి నారాయణ



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి పి.నారాయణ

నిరుపేద విద్యార్థులకు ఇంటర్మీడియట్‌లో నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతోనే నెల్లూరులోనే తొలిసారిగా మున్సిపల్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీని ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ చెప్పారు. 5వ తేదీ నెల్లూరు విఆర్‌సి ప్రాంగణంలోని మున్సిపల్ కార్పొరేషన్ జూనియర్ కాలేజీ విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రైవేట్ కాలేజీలలో కంటే ప్రభుత్వ కళాశాలల్లోనే అనుభవజ్ఞులైన అధ్యాపకులున్నారని, నాణ్యమైన విద్యను అందిస్తున్నారని చెప్పారు. మున్సిపల్ జూనియర్ కాలేజీ విద్యార్థులకు నారాయణ విద్యాసంస్థల నుండి స్టడీమెటీరియల్ అందిస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు మాట్లాడుతూ జీవితంలో విజయం సాధించాలంటే కష్టపడి చదవాలన్నారు. ఒక విద్యార్థిని 9వ తరగతి చదివేటప్పుడే తాను ఏమికావాలన్నది ఊహించుకోవాలన్నారు. అలా ప్రతిరోజూ ఊహించుకోవడం వలన సబ్‌కాన్షియస్‌లో మైండ్‌లోకి వెళ్ళి టైం వేస్ట్ చేసుకోకుండా వుంటారన్నారు. ప్రతి విద్యార్థికి మొదట పవర్ ఆఫ్ ఇమాజినేషన్ కావాలన్నారు. అబ్దుల్ కలాం కలలు కనండి, కలలను సాకారం చేసుకోండి అనే నినాదం గుర్తుంచుకోవాలన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో చదివానని, రేపటి పాఠం ఈరోజు చదివేవాడినన్నారు. ఈ కార్యక్రమంలో నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ శాసన సభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎఫ్‌సి, సిఎఫ్‌సి స్టేట్ కో-ఆర్డినేటర్ డి.వెంకటేశ్వరరావు, రాష్ట్ర టిడిపి మహిళా ఉపాధ్యక్షురాలు శ్రీమతి టి.అనూరాధ, హెచ్‌డిఎస్ ఛైర్మెన్ చాట్ల నరసింహరావు, జడ్పీటీసీలు, ఎంపీ టీసీలు, ప్రజాప్రతినిధులు, వసంత లక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత శ్రీమతి వసంత లక్ష్మి, నెల్లూరు మున్సిపల్ కమిషనర్ ఆలీంభాషా, డిఇఓ శామ్యూల్, అధికారులు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

## నెల్లూరురూరల్ నియోజకవర్గ

# మహిళా నేతలతో జగన్ భేటి



నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరురూరల్ నియోజకవర్గ మహిళా నేతలు ఈ నెల 5న వై.యస్.జగన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రతిమహిళను పేరుపేరునా వై.యస్.జగన్‌కు పరిచయం చేశాడు. నెల్లూరురూరల్ నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ మహిళా విభాగం చేస్తున్న కార్యక్రమాలను వై.యస్.జగన్‌కు వివరించారు. నెల్లూరురూరల్‌లో మహిళా విభాగం పటిష్టంగా వుందని, నెల్లూరురూరల్ మహిళా విభాగాన్ని పటిష్టంగా తయారు చేసినందుకు కోటంరెడ్డిని వై.యస్.జగన్ అభినందించారు. ఇదే ఉత్సాహంతో మహిళా విభాగం ముందుకు సాగాలని వై.యస్.జగన్ కోరారు. ఈ భేటీలో 41మంది మహిళా నేతలు పాల్గొన్నారు. నెల్లూరురూరల్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మొయిళ్ళ గౌరి, కాకుటూరు లక్ష్మీసునంద, సయ్యద్ హురియ, తోట శోభారాణి, తాజున్నీ, కమల్‌రాజ్ సంపూర్ణ, పాతిపాటి శ్రీలక్ష్మి, చేజర్ల కవిత, భారతి, ఆండ్రా పద్మారెడ్డి, కరణం మంజుల, కోటంరెడ్డి వైష్ణవి, జమునమ్మ, అనితారెడ్డి, ముంతాజ్‌బేగం, మందా పద్మజ, నీళ్ళ పెంచలమ్మ, బషీరా, దేవిశ్రీ, సుజితారెడ్డి, అరుణ, ముక్బుల్ జాన్, చెక్కా అహల్య, విజయకుమారి, మారంరెడ్డి నిర్మల, మాతూరి మీన తదితరులు పాల్గొన్నారు.

# కులతత్త్వం గుండెలు చీల్చిన జాషువా కవిత్వం

## - శాసనమండలి ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్



జాషువా విగ్రహావిష్కరణలో పాల్గొన్న మండలి బుద్ధప్రసాద్, కలెక్టర్ ముత్యాలరాజు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

సమాజంలో ప్రజ్వరిల్లుతున్న కులతత్వం రూపుమాపడానికి ప్రముఖ కవి, పద్మభూషణ్ గుర్రం జాషువా రచనలు ఎంతగానో ఉపయోగపడతాయని శాసన మండలి ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ కొనియాడారు. నెల్లూరు కస్తూర్బా కళాక్షేత్రంలో ఈ నెల 4న జాషువా కవితా పీఠం ఆధ్వర్యంలో, ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన పద్మభూషణ్, కళాప్రపూర్ణ గుర్రం జాషువా విగ్రహాన్ని ఆయన ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, విఎస్‌యు విసి వీరయ్యలతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నవయుగ కవిచక్రవర్తి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తాను రావడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. సాహితీవేత్తల విగ్రహాలను ఆవిష్కరించుకునే కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని అంటూ, మహాకవి తిక్కన విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని ప్రముఖ నేపథ్యగాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కోరారని, జిల్లా కలెక్టర్ స్థలం కేటాయిస్తే నెల్లూరులో తిక్కన విగ్రహాన్ని ఏర్పాటుచేస్తామన్నారు. గుర్రం జాషువా సాహిత్యాన్ని నేటితరానికి చేరువ చేసేందుకు విద్వాన్ కిరణశ్రీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. స్వాతంత్ర్యపోరాటంలో ఆయన రచనలు, పద్యాలు ఎంతో స్ఫూర్తినిచ్చాయని, గుర్రం జాషువా సాహిత్యం ద్వారా మానవత్వపు విలువలు తెలుసుకుని సంపూర్ణ మానవతావాదిగా ఎదగడానికి అందరికీ ఉపకరిస్తాయన్నారు. జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు మాట్లాడుతూ, గుర్రం జాషువా రచనల్లోని మానవతా విలువలు ఎంతో గొప్పవన్నారు. గుర్రం జాషువా శాసనమండలి సభ్యునిగా పదవిని పొందారని, 1970లో పద్మభూషణ్ అవార్డుతో సత్కారం అందుకున్నారని వివరించారు. ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర మాట్లాడుతూ, జాషువా పీఠం వ్యవస్థాపకులు కిరణశ్రీ అభ్యర్థన మేరకు గ్రంథాలయం ఏర్పాటుకు తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. జాయింట్ కలెక్టర్-2 వెంకటసుబ్బారెడ్డి, ఆర్డీఓ శ్రీమతి హరిత తదితర ప్రముఖులు పాల్గొన్న ఈ కార్యక్రమానికి జాషువా పీఠం వ్యవస్థాపకుడు కిరణశ్రీ అధ్యక్షత వహించగా, సింహపురి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ మరియు జాషువా పీఠం గౌరవాధ్యక్షుడు వీరయ్య పాల్గొన్నారు. తొలుత ప్రముఖులందరూ గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కిరణశ్రీ రచించిన గుర్రం జాషువా కవితా సంపుటిని ఆవిష్కరించారు. గొలగమూడి గురుకుల పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కుమారి తేజస్వి యోగవిన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం, విగ్రహ ఏర్పాటులో సహకరించిన శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్రలతో పాటు డిఎస్పీ మురళీకృష్ణ, సమాచారశాఖ ఉపసంచాలకులు షేక్ లాల్‌జాన్ తదితరులను ఈ సందర్భంగా నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఆప్కాబ్ ఛైర్మెన్ పాలుశెట్టి, గుర్రం జాషువా కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలి



3కె రన్‌ను ప్రారంభిస్తున్న జేసీ ఇంతియాజ్, ఎన్‌సిసి జిఎస్ యుగంధర్‌రెడ్డి

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఈ నెల4న నెల్లూరులోని ఆపోలో స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో నెల్లూరులో 3కె రన్‌ను నిర్వహించారు. కృష్ణ చైతన్య కళాశాలలు, విపిఆర్ ఫౌండేషన్ సంయుక్త సహకారంతో నిర్వహించిన ఈ రన్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్, ఎన్‌సిసి జిఎస్ యుగంధర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కృష్ణ చైతన్య కళాశాల నుంచి అపోలో ఆసుపత్రి వరకూ జరిగిన ఈ రన్‌లో సుమారు 500 మంది దాకా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న వ్యాధుల్లో క్యాన్సర్ ఒకటని, మనదేశంలో ఏటా సుమారు 5లక్షల మంది దాకా ఈ వ్యాధి బారినపడి మరణిస్తున్నారని తెలిపారు. ఈ వ్యాధి పట్ల అందరూ అప్రమత్తతో ఉండాలన్నారు. ఆసుపత్రి వైద్య నిపుణురాలు డాక్టర్ హరిత మాట్లాడుతూ తొలిదశలో గుర్తిస్తే ఈ క్యాన్సర్ వ్యాధిని నయం చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మురళీకృష్ణ, విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ప్రొ.నారాయణ రెడ్డి, అపోలో ఆసుపత్రి యూనిట్ హెడ్ నవీన్, కృష్ణచైతన్య విద్యాసంస్థల డీన్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# ముస్లింల అభివృద్ధికి కృషి చేస్తా

**- మేయర్ అబ్దుల్ అజీజ్**



మాట్లాడుతున్న మేయర్ అబ్దుల్ అజీజ్, షేక్ రియాజ్అహ్మద్ తదితరులు

ముస్లిం సోదరుల సంక్షేమానికి పాటుపడతానని, వారి అభివృద్ధికి కృషి చేసేలా చర్యలు తీసుకొంటామని నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. గూడూరు పట్టణంలో పివిఆర్ కళ్యాణ మండపంలో గూడూరు నియోజకవర్గ ముస్లిం సోదరుల ఐక్యవేదికను ఈ నెల 4వ తేదీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరుల అభివృద్ధికి కృషి చేసి సమస్యలు పరిష్కరించేలా చూస్తానని తెలిపారు. ముస్లిం సోదరుల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలియజేశారు. అనంతరం అజీజ్‌ను ముస్లిం సోదరులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకుడు, ఏపి డిప్లొమా ఇంజనీర్ల సంఘ అధ్యక్షులు షేక్ రియాజ్అహ్మద్, రహీమ్, గౌస్ పలువురు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# దివ్యాంగులకు ఫలసరుకులు



ఫలసరుకులు, దుస్తులు అందిస్తున్న డాక్టర్ సి.రోహిణి, ప్రభారెడ్డి తదితరులు

ప్రతి నెల క్రమం తప్పకుండా దాతల సహాయంతో ఫలసరుకులు అందించడం అభినందనీయమని ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి తెలిపారు. గూడూరు పట్టణంలోని వీరభద్రస్వామి దేవాలయంలో సోమవారం నాడు రెడ్ సంస్థ ఆధ్వర్యంలో గిరిజమ్మ దాతృత్వంతో ఫలసరుకులు, శేషగిరిరావు దాతృత్వంతో దుస్తులను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ రోహిణి మాట్లాడుతూ దివ్యాంగులుగా వున్న పేదలకు ప్రతి నెల ఫలసరుకులు అందించడంలో రెడ్ సంస్థ సేవలు సంతోషకరమని తెలిపారు. రెడ్‌సంస్థ ప్రతినిధులు సుధీర్, రాజేష్, రామలింగం, శ్రీధర్, ఆంధ్రమహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు ప్రభారెడ్డి, ప్రతినిధులు సౌందర్యమ్మ, విష్ణువందన, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఫైట్ క్యాన్సర్ 2కె రన్

ఫిబ్రవరి 4వ తేదీ ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గూడూరు పట్టణంలోని గడియారపు స్థంభం కూడలి ప్రాంతంలో ఆదిశంకరా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, యాజమాన్యం ఆధ్వర్యంలో ఆదిశంకరా ఇంజనీరింగ్ కళాశాల, మైథిలి హాస్పిటల్, పిఎస్ఆర్ ట్రస్ట్, రెడ్‌క్రాస్, కపిల్ చిట్స్, రైన్‌డ్రాప్, ఆర్ఎస్ మొబైల్స్, ఏరియా ఆసుపత్రి, వెల్‌కేర్, సీఆర్ రెడ్డి ఆసుపత్రి, ఎంఆర్ సుబ్బారెడ్డి, యాక్సిస్ బ్యాంకు, నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, ఆషిక్ రెస్టారెంట్, తదితరుల సహకారంతో 'ఫైట్ క్యాన్సర్ 2కె రన్'ను నిర్వహించారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, డిఎస్పీ రాంబాబు, ఆది శంకర కళాశాల డైరెక్టర్ ఎ.జగదీష్‌లు ప్రారంభించారు. ముందుగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కలిగించేలా యువత మార్గ నిర్దేశకులుగా వ్యవహరించాలన్నారు. దేశంలో సుమారు 7లక్షల మందికిపైగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారని, సుమారు 5లక్షల మంది వరకు చనిపోతున్నట్లు




మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, పొగాకు, మద్యం తదితర చెడు అలవాట్లు మానుకోవాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్.టి.రామారావు హైదరాబాద్‌లో తన భార్య క్యాన్సర్‌తో చనిపోతే, ప్రజల కోసం బసవతారక క్యాన్సర్ ఆసుపత్రిని స్థాపించారని తెలియజేశారు. మున్సిపల్ ఛైర్మెన్ పొనకా దేవసేన, డిఎస్పీ రాంబాబు, కళాశాల డైరెక్టర్ జగదీష్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని తరిమే సత్తా కేవలం యువతకు మాత్రమే ఉందని తెలిపారు. అనంతరం రన్‌ను గడియారపు స్థంభం కూడలి వద్దనుంచి జాతీయ రహదారి సమీపం వరకు విద్యా ర్థులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎ.వో రామయ్య, పట్టణ సీఐ సుబ్బారావు, యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

# కమిషనర్‌గా నరేంద్రకుమార్



గూడూరు పురపాలక సంఘ కమిషనర్‌గా ఎన్.నరేంద్రకుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో విధులలో చేరారు. ఈయన వెంకటగిరి మున్సిపల్ కమిషనర్‌గా ఉంటూ బదిలీపై గూడూరు వచ్చారు. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయనకు పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక అభివృద్ధికి ఎమ్మెల్యే, ఛైర్‌పర్సన్‌ల సహకారంతో కృషి చేస్తానని తెలిపారు.

# హుండీ దొంగలు దొరికారు



మాట్లాడుతున్న డిఎస్పీ రాంబాబు, సి.ఐ సుబ్బారావు తదితరులు

జల్సాలకు, చెడు అలవాట్లకు లోనైన ముగ్గురు దొంగలు ఎంచక్కా దేవాలయాల హుండీలనే టార్గెట్ చేశారు. హుండీలను పగలగొట్టి అందులోని డబ్బును తీసుకెళ్ళే ముఠాను ఇటీవల పోలీసులు అరెస్ట్ చేశారు. గూడూరు డిఎస్పీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో డిఎస్పీ రాంబాబు వివరాలు వెల్లడించారు. గూడూరు డివిజన్‌లోని గూడూరురూరల్, చిల్లకూరు, మనుబోలు, సైదాపురం, తడ, దక్కిలి, బాలాయపలిట్ల, గూడూరు రెండోపట్టణం, నెల్లూరు రూరల్, టిపిగూడూరు, ముత్తుకూరు తదితర పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 11 దేవాలయాలలో రాత్రిపూట తాళాలను పగలగొట్టి దోచుకొనే ముఠాలు నెల్లూరు సమీపం నారాయణ ఆసుపత్రి ప్రాంతానికి చెందిన వాసిపల్లపు దేవేంద్ర, వెంకటాచలం మండలం ఇమిడేపల్లి వడ్డిపాలెంకు చెందిన ఉప్పు వెంకటేష్, గూడూరు పట్టణం నరసింగరావుపేట ప్రాంతం బీసీకాలనీకి చెందిన బాలుడిని పోలీసులు గుర్తించారు. వారి నుంచి 14గ్రాముల బంగారం, 14వేల నగదు, 3మోటారు సైకిళ్ళను స్వాధీనం చేసుకొన్నట్లు డిఎస్పీ చెప్పారు. దొంగలు హుండీల చోరీలతోపాటు పలు ప్రాంతాల్లో చిల్లరంగళ్లను పగలగొట్టి డబ్బుల కోసం చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు.

గూడూరు సి.ఐ సుబ్బారావుకు వచ్చిన సమాచారం మేరకు నిందితులు గూడూరు మండలం గోగినేనిపురం ప్రాంతంలోని సిట్రస్ ఫ్యాక్టరీ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా, పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా దేవాలయాల చోరీలు ఘటన వెలుగులోకి వచ్చిందన్నారు. నిందితులు ముగ్గురిలో ఇద్దర్ని అరెస్ట్ చేయగా గతంలో కూడా జైలుకు వెళ్ళినట్లు చెప్పారు. ప్రస్తుతం గూడూరు ప్రాంతానికి చెందిన బాలుడిని పరిశీలనా గృహానికి పంపుతున్నామని, ఇద్దరిని ఇరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.ఐ సుబ్బారావు, ఎస్సైలు, బాచి, శ్రీనివాసులురెడ్డి, శ్రీనివాసరావు, సిబ్బంది, ఆర్.వి.రాజు, ఆదినారాయణ ఉన్నారు.



ఈ నెల 3వ తేదీన జరిగిన గూడూరు విఎస్ఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 9వ వార్షికోత్సవ కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, విఎస్ఆర్ స్కూల్ కరస్పాండెంట్ అన్నపూర్ణ, బాలకృష్ణంరాజు, ప్రిన్సిపాల్ రాంప్రసాద్ తదితరులు.



ఈ నెల 5వ తేదీ గూడూరు జడ్పీ బాలికల పాఠశాలలో డాక్టర్ సి.ఆర్.రెడ్డిని ఇన్నేళ్ళపాటు ఆయన చేసిన సేవలకు గుర్తుగా సన్మానిస్తున్న ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ మహిళలు

శ్రీను గల్పిక

# ట్రంప్‌కు ముచ్చెమటలు పట్టించిన బాబు

ప్రపంచంలోని 116 మేటి నగరాలను మిక్సీలో వేసి గ్రైండ్‌చేసి తీసిన అమరావతి నగరమది. ఉండవల్లిలోని హైటెక్‌రత్న, ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం. అప్పుడే పార్లమెంటులో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడ్జెట్‌లో ఏపికి మొండి చేయి చూపించారు. ఈ పరిణామంపై సానుభూతి తెలపడం కోసంగా మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అయ్యన్నపాత్రుడు, పి.నారాయణ, పత్తిపాటి పుల్లారావు, దేవినేని ఉమామహేశ్వరరావు, కేంద్రమంత్రి సుజనాచౌదరి, ఎంపీలు రాయపాటి సాంబశివరావు, సీఎం రమేష్‌లు కూడా వచ్చారు. అప్పుడే ఏ టివి, ఏబిసిడి చానెల్, టీవీ 9×9=99, టీవీ 2.5 ఛానెల్స్ ప్రతినిధులు వచ్చారు. ఇక అప్పుడు చంద్రబాబు తన విశ్వరూపం చూపడం మొదలుపెట్టాడు. అసలు ఏమనుకుంటున్నారు ఈ బీజేపీ వాళ్ళు... బడ్జెట్‌లో మనకు మొండిచేయి చూపిస్తారా? ఇప్పటివరకు నన్ను ఒక వైపే చూసారు. రెండోవైపు చూడాలనుకోవద్దు... తట్టుకోలేరు... మాడి మసైపోతారు. సింహంతో వేట... ఈ చంద్రబాబుతో ఆట వద్దు... నా మౌనాన్ని చేతగానితనంగా తీసుకోవద్దు... నా మౌనం తుఫాన్ ముందర ప్రశాంతతలాంటిది. నాదెబ్బకు పి.వి. నరసింహారావు, వాజ్‌పేయిలే పంచెలు తడుపుకున్నారు. ఈ మోడీ, అమిత్‌షాలు ఒక లెక్క... ఇక చెప్పండి ఆ మోడీకి... నిన్నటివరకు ఒక లెక్కా... ఈరోజునుండి ఒక లెక్క... నాతో గేమ్స్ ఆడాలనుకున్నారో... ఖబడ్దార్ అంటూ గట్టిగా తొడ చరిచాడు. ఆ సౌండ్‌కు సోమిరెడ్డి కొంచెం షేకయ్యి అటు ఇటూ వూగాడు. చంద్రబాబు ఆవేశపు డైలాగ్‌లు, హెచ్చరికలను షూట్ చేసిన ఏబిసిడి ఛానెల్ వాళ్లు అప్పటికప్పుడు బ్రేకింగ్ న్యూస్ మొదలుపెట్టారు. బడ్జెట్‌పై ఆగ్రహించిన చంద్రబాబు... పతనానికి చేరువలో ఎన్డీఏ ప్రభుత్వం... బాబు వార్నింగ్‌తో జడుసుకుంటున్న మోడీ... చంద్రబాబును ప్రసన్నం చేసుకునేందుకు దూతలుగా రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి... సహనం, సంయమనం పాటించాలని, దేశంలో శాంతిభద్రతలను కాపాడాలని చంద్రబాబును కోరిన ఎన్డీఏ మిత్రపక్షాలు... ఏబిసిడి ఛానెల్‌లో ఇలా చంద్రబాబు గురించి ప్రత్యేక కథనాలే ప్రసారం కాసాగాయి.

బడ్జెట్‌పై ప్రెస్‌కు స్టేట్‌మెంట్లిచ్చాక చంద్రబాబు తన గదిలో కొచ్చి కూర్చున్నాడు. అప్పుడే ఆయన ఫోన్ రింగయ్యింది. ఆయన ఎడమకన్ను అప్పుడే అదిరింది. ఇది ఖచ్చితంగా ఢిల్లీ ఫోనే అనుకుంటూ ఫోన్ తీసి ఆన్ చేశాడు. అవతల నుండి అమిత్‌షా... ఏం చంద్రబాబు గారు బాగున్నారా, ఇప్పుడే ఏబిసిడి ఛానెల్‌లో మీ ఇంటర్వ్యూ చూసాను సూపర్... మాకు భలే వార్నింగ్ ఇచ్చారు. మీరిచ్చిన వార్నింగ్‌తో మోడీకి జ్వరం వచ్చి ఇంట్లో ముసుగేసుకుని పడుకుని వున్నాడు. నాకైతే దడ తగ్గలేదు. ఏదో మీ ముందు చిన్న పిల్లలం. మమ్మల్ని అలా బెదిరిస్తే ఎలా సార్... అని వెటకారంగా అన్నాడు. అందుకు చంద్రబాబు... మీరు మరీ అంత వెటకారంగా మాట్లాడొద్దు సార్, మీ నుండి రియాక్షన్ ఉంటుందని తెలుసు... కాని ఏం చేయమంటారు, బడ్జెట్‌లో అసలు ఏపి ప్రస్తావనే లేకపోయే... కనీసం ఈ మాత్రం యాక్షన్ అన్నా చేయకపోతే... మరీ నన్ను మా వాళ్ళే చేతకానివాడనుకుంటారు సార్, నేను ఇలా మాట్లాడానని ఏమీ అనుకోవద్దు. మోడీ గారిని కూడా ఇవేమీ మనసులో పెట్టుకోవద్దని చెప్పండి... ప్లీజ్ అని వేడుకున్నాడు. సరేలే అని అమిత్‌షా ఫోన్ కట్ చేసాడు.

అంతలో మళ్ళీ చంద్రబాబు ఫోన్ మోగింది. మళ్ళీ మోడీ ఏమన్నా చేసాడా అనుకుంటూ ఫోన్ వైపు చూసాడు. ఐఎస్‌డి కాల్... ఒబామానో, బిల్‌గేట్సో, బిల్‌క్లింటనో అయ్యుంటాడనుకుంటూ ఫోన్ ఆన్ చేసాడు. అవతల నుండి... నాన్న నేను లోకేష్‌ని, న్యూజెర్సీ నుండి అని అన్నాడు. ఏరా లోకేష్... ఏంటి విశేషాలు అని చంద్రబాబు అడిగాడు. మీరు అర్జంట్‌గా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో తెలుగుదేశం పార్టీని మూసేసి అమెరికాకు వచ్చేయండి అని అన్నాడు. ఆ మాటకు చంద్రబాబు తల పదివేల కిలోమీటర్ల వేగంతో తిరగసాగింది. పది నిముషాలకుగాని చంద్రబాబు తేరుకోలేక పోయాడు. ఏమైందిరా లోకేష్ అంత మాటన్నావు అని చంద్రబాబు అడిగాడు. నాన్నారు... అమెరికాలో మన పార్టీ పరిస్థితి బాగుంది. ఇక్కడ ఎలక్షన్స్‌లో పోటీ చేస్తే మనమే అధికారంలోకి వచ్చేటట్లున్నాం. మీరు అమెరికా అధ్యక్షుడైతే మోడీలాంటి వాళ్ళంతా మీ చుట్టూనే వుంటారు. ప్రపంచమే మీ చుట్టూ తిరుగుతుందని లోకేష్ చెప్పాడు. ఆ మాటలతో చంద్రబాబుకు మైకం కమ్మేసింది. డబ్ అంటూ అక్కడే సోఫాలో పడిపోయాడు.

★★★★★

లోకేష్ కోరిక మేరకు చంద్రబాబు అమెరికాలో కాలుపెట్టాడు. వాషింగ్టన్ వేదికగా తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ట్రంప్‌ను వ్యతిరేకించే డెమోక్రాట్లు తమ పార్టీని తెలుగుదేశంలో విలీనం చేసారు. బిల్‌క్లింటన్, ఒబామా, హిల్లరీ క్లింటన్‌లు కూడా తెలుగుదేశంలో చేరి పచ్చకండువాలు కప్పుకున్నారు. ఆమెరికా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు, యువజన విభాగం అధ్యక్షుడిగా నారా లోకేష్, ప్రధాన కార్యదర్శిగా ఒబామా, ఉపాధ్యక్షుడిగా బిల్‌క్లింటన్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా హిల్లరీ క్లింటన్, మహిళా విభాగం ప్రచార కార్యదర్శిగా కండోలిజారైస్‌లను నియమించారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ఇక టైం దగ్గర పడుతుందనగా అమెరికా ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి, వారి కన్నీళ్ళు తుడవడానికి చంద్రబాబు లాస్‌ఏంజల్స్ నుండి 10వేల కిలోమీటర్ల 'నవ శంఖారావ పాదయాత్ర'కు శ్రీకారం చుట్టాడు. చంద్రబాబు పాదయాత్రకు విశేష స్పందన... అమెరికన్లు బ్రహ్మరథం పట్టసాగారు. అన్ని సర్వే సంస్థలు కూడా అమెరికా అధ్యక్ష ఎన్నికల రేస్‌లో దూసుకుపోతున్న చంద్రబాబు... ట్రంప్ కంటే ఆధిక్యంలో వున్న తెలుగువాడు... అని ముందస్తు ఫలితాలనిస్తున్నాయి. ముందస్తు సర్వేలను చూసి ట్రంప్‌కు భయమేసింది. వెంటనే ఆయన మోడీకి ఫోన్ చేసి... సార్, దయచేసి ఆ చంద్రబాబును మీ ఇండియాకు పిలిపించుకోండి... ఆయన ఇక్కడ వుంటే నా కుర్చీకే ఎసరొస్తుంది. అమెరికన్‌లంతా ఆయనకే జై కొడుతున్నారు. ప్లీజ్ నా కోసం ఆ చంద్రబాబును ఇక్కడ ఎన్నికల్లో పోటీ చేయకుండా చూడండి అని ఏడుస్తూ అడిగాడు. నేను ట్రై చేస్తాను అని మోడీ ఫోన్ పెట్టేసి, వెంటనే చంద్రబాబుకు చేసాడు. అవతల ఫోన్ ఎత్తగానే చంద్రబాబూజీ... మా మీద మనసులో ఏమీ పెట్టుకోవద్దు... మీపట్ల గతంలో మేం చేసిన తప్పులను మన్నించండి... దయచేసి అమెరికా నుండి వచ్చేయండి... మీరు అక్కడేవుంటే ఆ ట్రంప్‌కు పిచ్చి ఎక్కువై చచ్చేటట్లున్నాడు అని ప్రాథేయపడ్డాడు. అది విన్న బాబు... ఇదే చంద్రబాబు పవర్ అంటే... నన్నే తక్కువ అంచనా వేస్తావా... హ... హ... హ... అంటూ బిగ్గరగా నవ్వసాగాడు. అలా నవ్వుతుండగానే ఎవరో ముఖం మీద నీళ్ళు చల్లినట్లుండడంతో... టక్కున కళ్లు తెరిచాడు. ఎదురుగా తన శ్రీమతి భువనేశ్వరీ దేవి... చేతిలో చెంబు... అమెరికాకు నువ్వెప్పుడొచ్చావని చంద్రబాబు ఆమెను అడిగాడు. అందుకామె... నేను అమెరికా రావడం కాదు... మీరే అమరావతిలో వున్నారు... సోఫాలో పడుకుని కలవరిస్తున్నారు అని చెప్పింది. అప్పుడర్థమైంది చంద్రబాబుకు... లోకేష్ ఫోన్ కాల్ ఎఫెక్ట్‌తో అప్పటిదాకా జరిగిందంతా కల అని.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

అభినందనలు తెలియజేయడం, విందు వినోదములలో పాల్గొనడం జరుగుతుంది. ఉద్యోగులు తమ బాధ్యతలను జాగ్రత్తగా నిర్వహించండి. అనవసర సంఘర్షణలు వద్దు. విలువైన వస్తువులను సమకూర్చుకొంటారు. ఉద్యోగార్థులకు అవకాశాలు రావడం ప్రారంభమవుతుంది. కోర్టు వ్యవహారాలు అనుకూలం కాగలవు. ఆరోగ్యం జాగ్రత్త. ఆదాయ వృద్ధి బాగుంటుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

క్రయవిక్రయాలు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాలు, బాకీల సమస్యలు కొంతవరకు పరిష్కారం కాగలవు. విద్యాప్రగతి బాగుంటుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ఆదాయం ఆశించినంత ఉండదు. ఖర్చులు ఎక్కువుగా ఉంటాయి. చిన్న వ్యాపారులకు ఆశాజనకంగా ఉంటుంది. వృత్తి జీవనం కలవారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఉద్యోగులు తమ పైఅధికారులతోను పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. దైవ సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనుకోని దూరప్రయాణాలుంటాయి. శరీరానికి గాయాలు తగలవచ్చును. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరకగలవు. సంప్రదింపులు, అగ్రిమెంట్ వ్యవహారాలలో జాగ్రత్తగా ఉండండి. పెద్ద మొత్తాలలో పెట్టుబడులు, భాగస్వామ్య వ్యాపారాలు చేయొద్దు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

కుటుంబసభ్యులతో స్వల్ప భేదాభిప్రాయాలుండవచ్చును. నిర్మాణాలు, కార్మిక కాంట్రాక్టుదారులు వర్క్‌లతో ఇబ్బందిపడతారు. ఉద్యోగులకు అధికారులతో సత్సంబంధాలు నెలకొంటాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు లభించగలవు. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. బంధువులతో, సోదరులతో సమస్యలు సర్దుబాటు చేసికొంటారు. ఆరోగ్యం బాగుంటుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

స్థిరాస్థుల లావాదేవీలు ప్రస్తుతం చేయవద్దు. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. షేర్లు నిరుత్సాహం కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. వృత్తి వ్యాపార రంగాలలో ఆదాయం సామాన్యం. ఖర్చులు పెరగకుండా చూచుకొనాలి. వ్యాపార అవకాశాలు సరైనవి లభించవు. అవసరాలకు ఋణం చేయవలసిరావచ్చును.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

శుభకార్యాల ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. రావలసిన బాకీలు కొంత లభించడం, మంచి వార్తను వినడం జరుగుతుంది. కుటుంబసౌఖ్యముంటుంది. ఆదాయ వ్యయాలు సంతృప్తికరంగా ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి కొరకు కృషి చేస్తారు. అనుకున్న పనులకు చిన్న ఆటంకాలు కలిగి టెన్షన్ పెడుతుంటాయి. దూరప్రయాణాలుంటాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 9.2.2018 నుండి
తేది. 15.2.2018 వరకు

ఈ వారం కర్కాటకంలో రాహువు, తులలో గురువు, వృశ్చికంలో కుజుడు, ధనుస్సులో శని, మకరంలో రవి, బుధ కేతువులు, 13తేది నుండి కుంభంలో రవి, 14తేది నుండి కుంభంలో బుధుడు, కుంభంలో శుక్రుడు, వృశ్చిక ధనుర్మకర రాశులలో చంద్రుడు పర్యటిస్తారు.

### పంచాంగము

శుక్రమౌఢ్యమి. ముహూర్తములు లేవు.
తేది 13 మంగళవారం మహాశివరాత్రి.

### మాఘ మాస కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 9 | శుక్ర | నవమి | ప॥ గం.2.37వ॥ |
| తేది. 10 | శని | దశమి | సా॥ గం.4.20వ॥ |
| తేది. 11 | ఆది | ఏకాదశి | సా॥ గం.6.20వ॥ |
| తేది. 12 | సోమ | ద్వాదశి | రా॥ గం.8.27వ॥ |
| తేది. 13 | మంగళ | త్రయోదశి | రా॥ గం. 10.34వ॥ |
| తేది. 14 | బుధ | చతుర్దశి | రా॥ గం.12.28వ॥ |
| తేది. 15 | గురు | అమావాస్య | రా॥ గం.2.02వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

కొత్త విలువైన వస్తువులు సమకూర్చుకొంటారు. స్థిరాస్తుల లావాదేవీలందు అనుకూల పరిస్థితులుంటాయి. బంధుముఖ్యులు ప్రముఖులను కలుసుకొంటారు. విద్యావృద్ధి, ఆరోగ్యం బాగుంటుంది. పట్టుదలతో చేపట్టిన పనులను జరుపుతారు. అవసరాలకు రావలసిన డబ్బు లందుతాయి. వ్యవసాయ, పారిశ్రామిక వర్గాలు కొత్త పథకాలతో అభివృద్ధి చెందుతాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

చేపట్టిన పనులు సానుకూలం కాగలవు. సభలు సమావేశాలలో పాల్గొంటారు. ఉద్యోగ బాధ్యతలతో సామర్థ్యము, స్థాన మార్పులుంటాయి. ముఖ్య విషయాలలో పెద్దల సలహాలను స్వీకరిస్తే మేలు జరుగుతుంది. రావలసిన బాకీలు పరిష్కారం కావడం, కోర్టు కేసులందు అనుకూలత ఉంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు. ఉద్యోగార్థులకు ఆహ్వానాలు లభిస్తాయి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

యజమానులకు వర్కర్లతో సమస్యలు రావచ్చును. స్థిరాస్తుల లావాదేవీలు ప్రక్కన పెట్టండి. సభలు సమావేశాలలో పాల్గొంటారు. పెట్టుబడులకు మంచి అవకాశాలు లభిస్తాయి. షేర్‌మార్కెట్ ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఆరోగ్య ఆహార విషయాలలో జాగ్రత్త అవసరం. అనుకోని ఆదాయం కొంత లభిస్తుంది. వృత్తి వ్యాపారాలలో ఆర్థికస్థితి బాగుండి ఆదాయం పెరుగుతుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. అనుకున్న పనులు జరుగుతున్నా టెన్షన్ పడుతుంటారు. ఆరోగ్యం బాగుంటుంది. ఉద్యోగయత్నాలలో అనుకూలత బాగుంటుంది. కొత్త వస్తువులు సమకూర్చుకొంటారు. విద్యా ప్రగతి బాగుంటుంది. వృత్తి పరంగా సామాన్య ఆదాయం ఉంటుంది. వ్యాపార వర్గాలు ఆటంకాలను అధిగమించుతారు. ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

దైవ, సాంఘిక కార్యక్రమాలలో పాల్గొంటారు. అనుకున్న పనులు కార్యక్రమాలు తొందర తొందరగా పూర్తి చేయగలరు. ఉద్యోగులకు పనిభారం శ్రమ పెరుగుతుంది. వస్తు వాహన రిపేర్ల ఖర్చులుంటాయి. అనవసర వ్యవహారాలలో తలదూర్చకండి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ఆర్థికపరమైన ఇబ్బందులుంటాయి. అవసరాలకు ఋణం చేయవలసి రావచ్చును.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఉద్యోగ ప్రయత్నాలు చేసేవారికి మంచి అవకాశాలు లభించగలవు. అనుకోని ప్రయాణాలుంటాయి. సభలు సమావేశాలలో ప్రముఖపాత్ర నిర్వహిస్తారు. పనులు సక్రమంగా జరుగుతున్నా టెన్షన్ పడుతుంటారు. ఆరోగ్యం బాగుంటుంది. స్థిరాస్తుల మీద కొంత ఆదాయం లభిస్తుంది. విద్యాప్రగతి బాగుంటుంది. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా ఉండి అభివృద్ధి బాగుంటుంది.

# అధ్వాన్న నిర్వహణ




**నెల్లూరు - తడ** మధ్య జాతీయ రహదారి నిర్వహణ అధ్వాన్నంగా మారుతోంది. కొన్నేళ్ళ క్రితం వరకు కూడా నెల్లూరు - తడ మధ్యే జాతీయ రహదారి నిర్వహణ ఎంతో బాగుండేది. ఎక్కడ రోడ్డు గుంతలు పడినా, దెబ్బతిన్నా అప్పటి కప్పుడు బాగుచేస్తుండేవాళ్ళు. కాని, గత కొంతకాలంగా రహదారి నిర్వహణను సరిగా పట్టించుకోవడం లేదు. నెల్లూరు - సూళ్లూరుపేటల మధ్య రోడ్డు చాలాచోట్ల దెబ్బతింది. వంద కిలోమీటర్లకు పైగా వేగంతో వెళ్ళే వాహనాలు గతుకుల రోడ్డు వద్ద సడెన్ బ్రేకులు వేస్తే ఎంత ప్రమాదమో తెలుసు. రహదారి మధ్యలో డివైడర్ల నిర్వహణ కూడా సరిగా లేదు. నెల్లూరు-తడ మధ్య వెంకటాచలం, బూదనం, సూళ్లూరు పేట టోల్‌ప్లాజాలున్నాయి. ఒక్కో టైంలో వీటి వద్ద భారీఎత్తున వాహనాలు నిలిచి పోతున్నాయి. సిబ్బంది కొరత కారణంగా అన్ని కౌంటర్లు ఓపెన్ చేయకపోతుండ దంతో వాహనాలు 'క్యూ' కట్టాల్సి వస్తోంది.

## ఆరులైన్‌లయ్యేనా..?

కోవూరు నుండి విజయవాడ దాకా నాలుగులైన్లను ఆరులైన్లుగా విస్తరించారు. కాని కోవూరు-తడ మధ్య నాలుగులైన్ల రహదారిని ఆరులైన్లుగా విస్తరించే పని పెండింగ్‌లో పడింది. విజయవాడ - కోవూరు మధ్య పనులు చేస్తున్నప్పుడే ఇక్కడ కూడా పనులు మొదలుపెట్టి వుంటే ఇప్పటికి ఆరులైన్ల రహదారి పూర్తయ్యి రాకపోకలు బ్రహ్మాండంగా వుండేవి. ప్రతి క్రాసింగ్‌వద్ద అండర్ పాసింగ్ వచ్చి ప్రమాదాలు తగ్గి వుండేవి. అయితే 2001లో ఈ రహదారిని పిపిపి విధానంలో తీసుకున్న మలేషియా కంపెనీ ఆరులైన్ల విస్తరణకు మొగ్గు చూపకపోవడంతో పెండింగ్‌లో పడింది.

కాగా, సముద్రతీర ప్రాంతంలో ఏర్పాటు చేయాలనుకున్న రహదారి ప్రతిపాదనలు ప్రస్తుతానికి ప్రభుత్వం విరమించుకున్నట్లు తెలుస్తోంది. దాని బదులు నెల్లూరు-తడల మధ్య జాతీయ రహదారిని ఆరులైన్లుగా మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది.

ఈమేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్రానికి పంపారు. కేంద్రం ఆమోదం లభిస్తే త్వరలో నెల్లూరు-తడ రహదారి ఆరులైన్లుగా విస్తరించడం జరుగుతుంది.

## కాలధర్మం

### ఇంజనీర్ "ప్రసాద్‌రెడ్డి"



ఇంజనీర్‌గా, బిల్డర్‌గా గత 30 సంవత్సరాలుగా నెల్లూరులో ప్రసిద్ధి చెందిన ప్రసాద్ బిల్డర్స్ అధినేత యం.యస్.ప్రసాద్‌రెడ్డి తన 55వ యేట ఫిబ్రవరి 8వ తేదీ గురువారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచాడు. గత కొంతకాలంగా క్యాన్సర్ మహమ్మారితో పోరాడి చివరికి ఓడిపోయాడు. ప్రముఖ బిల్డర్, ఆర్కిటెక్ట్, మోహన్ ఆర్కిటెక్ట్స్ & అసోసియేట్స్ అధినేత మోహన్‌రెడ్డి దగ్గర శిష్యరికం చేసిన ప్రసాద్‌రెడ్డి, ప్రసాద్ బిల్డర్స్ పేరుతో స్వంతంగా సంస్థను ప్రారంభించి తన గురువు మోహన్‌రెడ్డి తరహాలోనే ఎంతోమందికి శిక్షణనిచ్చి తన శిష్యులుగా మార్చుకున్నాడు. బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా ప్రసాద్‌రెడ్డి కొంతకాలం పని చేశాడు.

ఎప్పుడూ నవ్వుతూ పలుకరించే ప్రసాద్‌రెడ్డికి నెల్లూరులో మంచి బిల్డర్‌గా, ఇంజనీర్‌గా గుర్తింపు వుంది. ఆయనకు భార్య, ఒక కుమార్తె, కుమారుడు వున్నారు. 8వ తేదీ జరిగిన ఆయన అంతిమయాత్రలో బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులతో పాటు భవన నిర్మాణ కార్మికులు, ప్రసాద్‌రెడ్డి క్లయింట్‌లు, అభిమానులు, ఆప్తులు, బంధువులు అధిక సంఖ్యలో పాల్గొని ఆయనకు నివాళులర్పించారు. ప్రసాద్‌రెడ్డి మృతికి చింతిస్తూ వారి కుటుంబసభ్యులకు, ఆయన ఆప్తులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### బెగోరె కుమార్తె శ్రీమతి అనూరాధ



మాజీగవర్నర్, ఆంధ్రప్రదేశ్ మాజీముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి గారి ఏకైక కుమార్తె శ్రీమతి దేగా అనూరాధమ్మ ఈ నెల 6వ తేదీ రాత్రి కన్నుమూసారు. ఆమె వయస్సు 69 సంవత్సరాలు. ఆమెకు ఒక కుమార్తె వున్నారు. డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డికి ముగ్గురు సంతానం. పెద్దకొడుకు కృష్ణమోహన్‌రెడ్డి, చిన్నకొడుకు ఆనందరెడ్డి. మధ్యలో కుమార్తె అనూరాధ. గోపాలరెడ్డి వివిధ పదవుల్లో వుండడం మూలాన ఆమె చిన్నతనంలో చెన్నై, ఢిల్లీ, లక్నో తదితర ప్రాంతాల్లో పెరిగారు. ఢిల్లీ యూనివర్శిటీ నుండి ఆమె ఎం.ఏ గోల్డ్‌మెడల్ సాధించారు. తెలుగుతో పాటు ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ భాషల్లో ఆమె అత్యంత ప్రావీణ్యం సంపాదించారు. ఎలాంటి అంశంపైనైనా ఆమె అనర్గళంగా సంభాషించేవారు. తండ్రి బెజవాడ గోపాలరెడ్డి నుండి నేర్చుకున్న క్రమశిక్షణ, మానవత్వం, సేవాతత్వంతో ఆమె అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. పేదల కోసం అనేక గుప్తదానాలు చేసారు. ఎన్నో పర్యాయాలు పేద కళాకారులను, పేద సాహితీవేత్తలను తన తండ్రి స్మారకంగా ఆర్థిక పురస్కారాలతో ఆమె సత్కరించారు. నెల్లూరులోని ప్రగతి ఛారిటీస్ అనాథపిల్లల సంక్షేమం కోసం లక్షలాది రూపాయలు విరాళంగా ఇచ్చారు. కస్తూరిదేవి విద్యాలయం కమిటి సభ్యురాలిగా వుంటూ మహిళల విద్యావికాసానికి తనవంతు కృషి చేసేవారు. ఆమె మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### ఎస్పీబీ అక్క శ్రీమతి విజయలక్ష్మి



ప్రముఖ నేపథ్యగాయకుడు డా॥ యస్.పి.బాలసుబ్రహ్మణ్యం అక్క శ్రీమతి విజయలక్ష్మి(81) ఫిబ్రవరి 6వ తేదీ సాయంత్రం కన్నుమూశారు. ఆమె నెల్లూరులో తన తల్లి వద్ద వుంటూ గత కొంతకాలంగా అనారోగ్యానికి గురయ్యారు. బుధవారం నెల్లూరులో జరిగిన ఆమె అంత్యక్రియలలో బాలసుబ్రహ్మణ్యంతో పాటు వారి కుటుంబసభ్యులు, బాలు ఆప్తులు, మిత్రులు పాల్గొన్నారు. ఆమె మృతికి ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### వి.ఎస్.యు రిజిస్ట్రార్‌గా దుర్గాప్రసాద్

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం కొత్త రిజిస్ట్రార్‌గా ఆచార్య దుర్గాప్రసాదరావు ఈనెల 7వతేదీన బాధ్యతలు స్వీకరించారు. కాకుటూరులోని యూనివర్శిటీ భవనంలోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించిన ఆయనను విఎస్‌యు ప్రిన్సిపాల్, పాలకమండలి సభ్యులు, సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

### పంచాయితీరాజ్ ఎస్.ఇగా నాగేశ్వరరావు

జిల్లా పంచాయితీరాజ్ ఎస్.ఇగా పి.నాగేశ్వరరావు 7వతేదీ బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో కడప పి.ఆర్ ఎస్.ఇగా పని చేస్తూ కొద్దిరోజులుగా సెలవుల్లో వున్నారు. ఇప్పుడు బదిలీపై నెల్లూరొచ్చారు.

## రెయిన్‌బోలో ఇంగ్లీష్ ఫెస్ట్




నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని రెయిన్‌బో స్కూలులో ఇటీవల మూడురోజుల పాటు ఇంగ్లీషు లాంగ్వేజ్ పట్ల ఆసక్తి పెంచడానికి, భాషాభివృద్ధి కొరకు ఇంగ్లీష్ ఫెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు వివిధరకాల కార్యక్రమాల్లో పాల్గొని ఇంగ్లీషు భాష పట్ల వారి ప్రతిభను ప్రదర్శించారు. పిల్లలు, ఉపాధ్యాయులు కలిసి పాటలు, పజిల్స్, రిడిల్స్, స్కిట్స్, టంగ్ ట్విస్టర్స్, డాన్స్‌లు, మాబ్ సింగింగ్ వంటి ప్రత్యేకమైన కార్యక్రమాలను ప్రదర్శించారు. పిల్లల తల్లిదండ్రులు పాల్గొని ఇంగ్లీష్ భాషా విశిష్టతను, దానియొక్క ప్రాధాన్యతను తెలుపుతూ స్ఫూర్తినిచ్చారు. పాఠశాల కరస్పాండెంట్ సుబ్రహ్మణ్యం, డైరెక్టర్ పద్మాసుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ అరుణా స్వయంప్రభ, ఉపాధ్యాయులు పాల్గొని విలువైన సందేశాలు ఇచ్చి, పిల్లలను అభినందించారు.

## శివనామ స్మరణలతో మారుమ్రోగుతున్న శ్రీకాళహస్తి

- అంగరంగ వైభవంగా..మహాశివరాత్రి మహోత్సవాలు
- భక్తజనులతో కిటకిటలాడుతున్న ఆలయం






దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయం ఈ మహాశివరాత్రి మహోత్సవాల సందర్భంగా శివనామ స్మరణల మధ్య, అశేష భక్తజనుల కోలాహలంతో కిటకిటలాడుతోంది. ఆలయంలోనూ, వెలుపలా ఎటుచూసినా భక్తజన ప్రవాహమే. మహాశివరాత్రి ఉత్సవాలకు పెట్టిందిపేరైన శ్రీకాళహస్తీశ్వరాలయం ఈ వేడుకల్లో మరింత దేదీప్యమానంగా వెలుగొందుతోంది. ఎంతో విశిష్టమైన ఈ ఉత్సవాలకు ప్రారంభసూచకంగా ఆలయంలో ఈ నెల 8వ తేదీన ఎంతో వైభవంగా ధ్వజారోహణం జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకుని తరించారు. ఈ నెల 20వ తేదీ వరకు నేత్రపర్వంగా సాగే ఈ శివరాత్రి బ్రహ్మోత్సవాలకు భారీసంఖ్యలో విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఇటీవల జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న, ఎమ్మెల్యే బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై బ్రహ్మోత్సవ ఏర్పాట్ల విషయమై చర్చించారు. అధికారులకు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. గత ఏడాది శివరాత్రి ఉత్సవాలకు సుమారు లక్షా 60 వేల మందికి పైగా భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారని, ఈ ఏడాది కనీసం రెండు లక్షల మందికి పైగానే భక్తులు విచ్చేస్తారనే అంచనాతో భక్తుల కోసం తగు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసారి తొలిసారిగా బంగారుతాపడంతో చేయించిన వాహనాలపై స్వామివార్ల ఊరేగింపు ఉంటుందని వారు ఈ సందర్భంగా తెలియజేశారు. అదేవిధంగా,. మహాశివరాత్రి రోజున భక్తుల సౌకర్యార్థం మహా లఘుదర్శనం ఏర్పాటు చేస్తున్నామన్నారు. దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి మాణిక్యాలరావు 12వ తేదీన శ్రీకాళహస్తికి విచ్చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రభుత్వం తరపున స్వామివార్లకు పట్టువస్త్రాలను సమర్పిస్తారన్నారు. భక్తులకు ఉచిత దర్శనం టిక్కెట్లతో పాటు, 50-200-500 రూపాయల టిక్కెట్లను కూడా అందుబాటులో ఉంచుతామన్నారు. క్యూలైన్లను విస్తృతం చేశామని, క్యూలైన్లలో భక్తులకు మంచినీరు, పాలు, ఆహారం అందిస్తామని తెలిపారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణమంతా విద్యుత్‌దీపకాంతులతో శోభాయమానం చేశామన్నారు. ఆలయ ఇ.ఓ డి.భ్రమరాంబ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు ఈ వేడుకలను పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ట్రస్ట్‌బోర్డు ఛైర్మెన్ శాంతారాం జె.పవార్, ఏఇలు చిట్టెమ్మ, పిఆర్‌ఓ నాగయ్య, మాజీ ట్రస్ట్‌బోర్డు ఛైర్మెన్-బిజెపి నాయకుడు కోలా ఆనంద్‌కుమార్, మునిసిపల్ ఛైర్మెన్ ముత్యాల పార్థసారథి, కమిషనర్ రమేష్‌బాబు, తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

# 'కోత' ముఠాపై పోలీస్ దాడి



కుక్క తోక వంకర అన్న సామెత చాలా మంది విషయాలలో ఋజువవుతుం టుంది. క్రికెట్ బెట్టింగ్ కేసులో అరెస్టయ్యి, మొన్నటివరకు జైలులో ఉండొచ్చినా కూడా బెట్టింగ్ నిందితుడు కృష్ణసింగ్‌లో మార్పు రాలేదు. పెద్దఎత్తున పేకాట శిబిరం నిర్వ హిస్తూ మరోసారి పోలీసులకు చిక్కాడు. ఈ నెల 7వ తేదీన నెల్లూరు రూరల్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రూరల్ సి.ఐ పి.శ్రీనివాస రెడ్డి దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. నెల్లూరురూరల్ మండలం కందమూరు వద్ద ఏపి ఫారెస్ట్‌కు చెందిన జామాయిల్ తోటల్లో భారీఎత్తున కోత ముక్కల పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందింది. జిల్లా ఎస్పీ రామకృష్ణ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డి విఠలేశ్వర రావు, రూరల్ డిఎస్పీ కె.వి.రాఘవరెడ్డిల ఆధ్వర్యంలో 6వ తేదీ రాత్రి పేకాట శిబిరంపై ఆకస్మిక దాడులు జరిపారు. జూదం ఆడుతున్న వ్యక్తులు కర్రలు, కత్తులు, ఇనుపరాడ్లు వంటి మారణాయుధాలతో పోలీసులపై దాడికి ప్రయత్నించారు. వారి దాడి నుండి పోలీసులు చాకచక్యంగా తప్పించుకున్నారు. బెట్టింగ్ మాఫియా నిందితుడు కృష్ణసింగ్‌తో సహా 21మందిని అరెస్ట్ చేసి 20,15,778 రూపాయలు నగదుతో పాటు మూడు కార్లు, 11 బైక్‌లు, 20 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో చాక చక్యంగా వ్యవహరించిన సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు రివార్డులు ప్రకటించా రని సి.ఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

# విపత్తు నష్టాలను నివారిద్దాం

## రెడ్‌క్రాస్-సెటెన్లెల్ ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు



ముందు జాగ్రత్త తీసు కుంటే ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల సమయంలో సంభవించే ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించవచ్చని వక్తలు పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, యువ జన సంక్షేమశాఖ, ఇండి యన్ రెడ్‌క్రాస్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో కావలిలోని జవహర్‌భారతి డిగ్రీ కళాశాలలో 3రోజులు ప్రాథమిక చికిత్స, విపత్తు నివారణకు సంబంధించి జరిగిన ఈ శిక్షణా తరగతులను కళాశాల ప్రిన్సిపాల్ మేజర్ ఏ. పాల్‌మనోహర్ ప్రారంభించారు. కావలి రెడ్‌క్రాస్ ఛైర్మెన్ డి.రవిప్రకాష్ మాట్లాడుతూ, మనదేశంలోని 69శాతం భూ భాగంలో భూకంపాలు, సునామీలు, వరదలు సంభవించే ప్రాంతాలున్నాయని, ప్రజలు తగు శిక్షణ ద్వారా మానవ, మూగజీవాల ప్రాణాలను కాపాడుకోవచ్చని, ఆస్తి నష్టాలను నివారించుకోవచ్చని తెలిపారు. రెడ్‌క్రాస్ రీజనల్ కో-ఆర్డినేటర్ గంటా రవికుమార్, జెబి కళాశాల లైబ్రేరియన్, యూత్ రెడ్‌క్రాస్ నిర్వాహకులు వెంకట్రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమశాఖ, సెట్నెల్ పరిపాలనాధికారి శ్రీమన్నారాయణ, లక్ష్మీనందకుమార్, గంధం ప్రసన్నాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## గుడిపాటికి ఈదూరు సుబ్బయ్య సాహితీ పురస్కారం

ప్రముఖ సాహితీవేత్త గుడిపాటికి ఈదూరు సుబ్బయ్య సాహితీ పురస్కారాన్ని ఈనెల 11న హైదరాబాద్‌లో జరిగే కార్య క్రమంలో ప్రదానం చేస్తున్నామని ఈదూరు సుబ్బయ్య సాహితీ పీఠం వ్యవస్థాపకులు డాక్టర్ ఈదూరు సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతియేటా ఈ సాహిత్య పుర స్కారాన్ని గ్రహీతలకు వారి స్వస్థలాల్లోనే ప్రదానం చేస్తున్నామని తెలిపారు. పుర స్కారగ్రహీతకు రూ.10వేలు నగదు, జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించ నున్నామన్నారు.

# ఎవరెవరెక్కడ?

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టత రావాల్సివుంది. సర్వేల ద్వారా ఇక్కడ ఎవరు గట్టిఅభ్యర్థి అన్నది తేల్చు కోవాలి. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తెలుగుదేశంలో చేరడం తెలిసిందే! తర్వాత మేరిగ మురళీధర్‌ను గూడూరు ఇన్‌ఛార్జ్‌గా పెట్టారు. అయితే మురళీధర్ ఇక్కడ తట్టుకుని నిలవడం కష్టం. మేకపాటి వాళ్ళు మాత్రం మేరిగ మురళీకే సీటివ్వా లన్నట్లు మాట్లాడుతున్నారు. కాని అతను సరిపోడనిపిస్తోంది. ఈ నియోజకవర్గానికి ప్రస్తుతం కాంగ్రెస్‌లో వున్న ఓ నాయకుడి పేరు గట్టిగా వినిపిస్తోంది. అతనైతే గట్టిపోటీ ఇవ్వగలడని ప్రచారం ఉంది. కాబట్టి గూడూరు అభ్యర్థి ఎవరన్నది కూడా తేలాల్సివుంది. నెల్లూరు నగరం, రూరల్, సర్వేపల్లి నియోజకవర్గాలు మళ్ళీ సిటింగ్ ఎమ్మెల్యేలకే దక్కుతాయి. ఇందులో సందేహం లేదు. కావలి సీటు విషయంలో మాత్రం సిటింగ్ ఎమ్మెల్యే ప్రతాప్‌కు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డికి మధ్య కొట్లాట జరుగుతోంది. గతంలో కావలిలో జరిగిన పార్టీ ప్లీనరీ సమావేశంలో ఈసారి కూడా సీటు ప్రతాప్‌కే అని చెప్పి ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి వివాదాలకు ఆజ్యం పోశాడు. ఈసారి కావలి సీటు నాశిస్తున్న మాజీఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణు వర్ధన్‌రెడ్డి అప్పుడే ఎంపీపై మండిపడటం తెలిసిందే! కావలిలో ఎవరు కరెక్టో సర్వే నిర్వహించాకే అభ్యర్థిని తేల్చాలని విష్ణు పట్టుబట్టాడు కూడా! ఈ విషయం తేల్చు లేదని చెప్పి జిల్లాలో జగన్ పాదయాత్రకు కూడా విష్ణు దూరంగా ఉండిపోయాడు. అలాగే మరో మాజీఎమ్మెల్యే వంటేరు వేణుగోపాలరెడ్డి సీటు విషయమై గట్టిగా పట్టుబట్టినప్పటికీ అతని మద్దతు కూడా కీలకం కానుంది. కాబట్టి ఇక్కడ ముగ్గురి మధ్య సమన్వయం కుదరాల్సివుంది. అభ్యర్థి ఎవరైనా మిగతావాళ్ళు మద్దతుగా పనిచేస్తేనే ఇక్కడ పార్టీ విజయావకాశాలు మెరుగ్గా ఉంటాయి. కోవూరు ప్రసన్నకే ఉండొచ్చన్న ధీమా ఉన్నప్పటికీ, ఇక్కడ కూడా అభ్యర్థిని మార్చి ప్రసన్నకు 2019 తరువాత ఎం.ఎల్.సి ఇవ్వాలనే ఆలో చనలో పార్టీ వున్నట్లు సమాచారం. అయితే ఇక్కడ నిలబడగలిగే అభ్యర్థి ఖచ్చితంగా తెలుగుదేశం నుండి రాబోయేవాడే కాబట్టి అది ఎవరన్నది తేలాల్సివుంది. ఆత్మకూరు, ఉదయగిరి సీట్లలో మేకపాటి కుటుంబ సభ్యులే పోటీ చేస్తారా లేక నేతల మార్పిడి ప్రక్రియలో ఒక సీటును ఉంచుకుని ఇంకో కటి వేరేవాళ్ళకు కేటాయిస్తారా అన్నది చూడాలి. ఉదయగిరి నుండి వాళ్ళు పోటీ చేసి ఆత్మకూరుకు అప్పటికి గట్టి అభ్యర్థి దొరికితే పోటీకి దించే ఆలోచనలు కూడా వున్నాయి. అన్ని నియోజకవర్గాలలో అభ్యర్థుల విషయమై క్లారిటీ వస్తే ప్రజల్లోకి వెళ్ళడానికి, పరపతి పెంచుకోవడానికి అవకాశం ఉంటుంది.

అంతిమ నిర్ణయం జగన్మోహన్‌రెడ్డిదే అయినా ప్రస్తుతం ఇన్‌ఛార్జ్‌గా వ్యవహ రిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి పాత్ర కూడా ఇక్కడ కీలకమే. అయితే రామకృష్ణారెడ్డికి నెల్లూరుజిల్లాపై పెద్దగా అవగాహన లేదు. నేరుగా పైస్థాయి నాయకులతో ఆయన మాట్లాడుతున్నాడు తప్ప సామాన్యులతో ఆయన మాట్లాడే అవకాశమే లేదు. నేత లతో తప్ప జిల్లాలో ఎవరితోనూ ఆయ నకు పెద్దగా పరిచయాలు కూడా లేవు. వై.యస్.రాజశేఖరరెడ్డి హయాం నుండి జిల్లా గురించి క్షుణ్ణంగా తెలిసిన వ్యక్తిగా వై.వి.సుబ్బారెడ్డికి పేరుంది. అయితే ఆయనను తొలగించి జిల్లాతో పూర్తిగా పరిచయాలు, అవగాహన లేని వ్యక్తిని నెల్లూరుజిల్లా ఇన్‌ఛార్జ్‌గా పెట్టడం కూడా ప్రస్తుత నాయక గణానికి చాలామందికి ఇష్టం లేదు. తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీల నుండి వలసవీరులు రెడీగా వున్నారు. సమన్వయ లోపం లేకుండా వాళ్ళందరినీ పార్టీలోకి ఆహ్వానించి ఎవరిని ఎక్కడ వాడుకోవాలో తెలిసిన ఇన్‌ఛార్జ్ ఇప్పుడు నెల్లూరుజిల్లాకి చాలా అవసరం.

ఏదేమైనా రాబోయే ఎన్నికలు చాలా ప్రతిష్ఠాత్మకమైనవి. ఒకటికి పదిసార్లు ఆవపోసన పట్టి, అవగాహన చేసుకుని నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# 10న జాతీయ మెగా లోక్‌అదాలత్

జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల పిలుపుమేరకు ఈ నెల 10వ తేదీన జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు నెల్లూరుజిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. ఈ నెల 6న న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని కోర్టులతో పాటు నెల్లూరు నగరంలోని జిల్లా కోర్టు ఆవరణంలో ప్రత్యేక బెంచ్‌లు ఏర్పాటుచేసి జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నామన్నారు. ఈ లోక్‌అదాలత్‌లో రాజీ ఆమోదయోగ్యమైన సివిల్, క్రిమినల్, కుటుంబ వివాదాలు, బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీలు, మోటార్ వాహన ప్రమాద కేసులు, ప్రీ లిటికేషన్ కేసులు పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు, వివిధ సంస్థల అధికారులు, న్యాయవాదులు వినియోగించుకుని జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. సంస్థ కార్యదర్శి పి.జె.సుధ పాల్గొన్నారు.

### అమెరికా డాక్టర్లచే

# ఉచితంగా గ్రహణమొర్రి ఆపరేషన్లు



- డా॥ టి.రవికుమార్

నెల్లూరు పొగతోటలోని డాక్టర్ రవికుమార్ రిచ్ హాస్పిటల్‌లో ఈ నెల 9వ తేదీ నుండి ఈ ఏడాది వరకు ఉచితంగా గ్రహణ మొర్రి ఆపరేషన్లు నిర్వహిస్తామని రిచ్ హాస్పిటల్స్ ఛైర్మెన్ డా॥ టి.రవికుమార్ పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీ తమ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఉచిత శస్త్ర చికిత్స వైద్యశిబిరంలో అమెరికాకు చెందిన గ్లోబల్ స్మైల్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ డా॥ ఉస్మాన్ హమ్ దన్, డా॥ ఎలీసా, డా॥ చరణ్య విజయకుమార్, డా॥ శ్రీకాంత్ మల్లినేని, డా॥ సుధీర్‌ల ఆధ్వర్యంలో ఆపరేషన్లు నిర్వహిస్తారని, పురిటిబిడ్డల నుంచి 40ఏళ్ళ వయస్సుగల వారికి ఆపరేషన్లు నిర్వహిస్తారన్నారు, చాలామంది పిల్లలు పుట్టుకతోనే పెదవి చీలిక, అంగిటి చీలికలతో జన్మిస్తారని, దీనివల్ల పాలు త్రాగడం, ఆహారం తీసుకోవడానికి ఇబ్బంది పడుతారని, మాటలు కూడా సరిగా రావని, వీరికి వీలైనంత త్వరగా ఆపరేషన్ చేస్తే మామూలు పరిస్థితికి వస్తారని తెలిపారు. ఈ రకమైన ఆపరేషన్లు చాలా ఖర్చుతో కూడుకున్నవని, ఇలాంటి సమస్య ఉన్న ఆపరేషన్లు రిచ్ హాస్పిటల్‌లో ఉచితంగా నిర్వహించి, మందులు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పరువు నాటకం

(మొదటి పేజీ తరువాయి)

ఓటు-నోటు కేసు మూలంగానే కేంద్రప్రభుత్వాన్ని నిలదీయలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వ ముంది. చాలా దారుణమైన రాష్ట్ర విభజన ద్వారా ఏపికి గత యూపిఏ ప్రభుత్వం అన్యాయం చేస్తే, పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కడం ద్వారా ఎన్డీఏ ప్రభుత్వం ఏపికి మరింత ద్రోహం చేస్తోంది. విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్ పట్ల బీజేపీ నాయకులు, అందులోనూ ప్రత్యేకంగా నరేంద్రమోడీ ఎక్కడా లేని సానుభూతి చూపించాడు. తీరా అధికారంలోకి వచ్చాక ఏం చేశాడు. ఏ ఒక్క హామీ పట్ల చిత్తశుద్ధి చూపలేదు. ప్రత్యేకహోదాను అటకెక్కించారు. దీనికి పలు సాకులు చూపారు. పోలవరం ప్రాజెక్ట్ విషయంలోనూ వివాదాలే! ఈ ప్రాజెక్ట్‌ను కేంద్రమే చేపట్టి పూర్తి చేసుంటే సరిపోయుండేది. మధ్యలో చంద్రబాబు వేలు పెట్టాడు. ఈ ప్రాజెక్ట్‌ను తమకు అప్పగించా లని కోరాడు. పోలవరం నుండి ఏదో ఆశించి ఆయన కేంద్రం నుండి లాక్కున్నాడు. వాళ్ళు కూడా మాకెందుకొచ్చిన పీడా అని చెప్పి ఈయనకు వదిలేసారు. చిక్కిందే ఛాన్స్ అని చంద్రబాబు దీనిని మరో అమరావతి రాజధానిని చేశారు. 16వేల కోట్ల అంచనా ప్రాజెక్ట్‌ను 58వేల కోట్ల అంచనాకు తీసుకెళ్లారు. ఇక్కడే కేంద్రానికి మండింది. లెక్కలు చూపిస్తేనే బిల్లులు అంటూ పేచీ పెట్టడంతో పోలవరం ప్రాజెక్ట్‌లో స్థబ్దత ఏర్పడింది.

ఇక మొన్న కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో అయితే ఏపికి పూర్తిగా మొండిచేయే చూపారు. పోలవరంకు నిధుల ఊసేలేదు. విశాఖ రైల్వేజోన్ ప్రస్తావన లేదు. దుగరాజపట్నం పోర్ట్, కడప ఉక్కు ఫ్యాక్టరీ హామీలు లేవు. ఏపికి ప్రత్యేకహోదా సరే ప్రత్యేకప్యాకేజీ క్రింద ఇచ్చిన నిధుల ప్రస్తావన లేదు. మొత్తంగా ఏపిని చిన్నచూపు చూసారు. గత నాలుగు బడ్జెట్‌లలో జరిగిన అన్యాయాన్నే ఈ బడ్జెట్‌లోనూ కొనసాగించారు.

రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతున్నా కేంద్రంపై గట్టిగా పోరాడలేని పరిస్థితి చంద్రబాబుది. రాష్ట్రానికి ఇంత అన్యాయం జరిగాక ఆయనకు ఏ మాత్రం పౌరుషం వున్నా కేంద్రంలో తన ఇద్దరు మంత్రుల చేత రాజీనామా చేయించి వుండాలి. ఎన్డీఏ నుండి వైదొలిగి వుండాలి. కాని అలా చేయలేదు. మోడీతో ఇప్పుడు పెట్టుకుంటే 'ఓటు-నోటు' కేసును మళ్ళీ ఎక్కడ గెలుకుతాడోనని భయం. అలాగని కనీస అసంతృప్తి వ్యక్తం చేయకుంటే రాష్ట్ర ప్రజల్లో చులకనైపోతామని భయం. అందుకే కేంద్రంపై చంద్రబాబు ఆగ్రహంతో వున్నట్లు అనుకూల మీడియాలో కవరేజీ... పార్లమెంటులో టీడీపీ ఎంపీల నామ్‌కే వాస్తే నిరసనలు... వీటివల్ల తెగేది లేదు... తెల్లారేదీ లేదు. చంద్రబాబు ఆగ్రహించాడని ఎల్లో మీడియాలో రాగానే మోడీ ఫ్యాంటు తడుపుకునేదేమీ లేదు. చంద్రబాబు వాళ్ళ చేతుల్లో బుక్కయ్యున్నాడు. కాబట్టి రాష్ట్రానికి ఎంత అన్యాయం జరుగుతున్నా ఎదిరించే పరిస్థితి లేకుండాపోయింది. అయితే ఇక్కడ కేంద్రం గుర్తిం చాల్సింది... వాళ్ళు 'ఓటు-నోటు' కేసును అడ్డం పెట్టుకుని ఆడుకుంటున్నది చంద్రబాబు తోనే కాదు... ఆరుకోట్ల ఆంధ్రుల భవిష్యత్‌తో కూడా అని.

# టిఎస్సార్ ఫిబ్రవరి సంబరాలు

- 13న మహాశివరాత్రికి మహాకుంభాభిషేకం
- కైకాల సత్యనారాయణకు 'విశ్వనట సామ్రాట్' బిరుదు
- 16న సినీ కళోత్సవం.. ఆశాభోస్లేకి యష్‌చోప్రా అవార్డు



రాజ్యసభ సభ్యుడు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, కళాబంధు టి.సుబ్బరామిరెడ్డి లలిత కళాపరిషత్ ఆధ్వర్యంలో మహాశివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని ఫిబ్రవరిలో ఆధ్యాత్మిక, కళా సంబరాలు జరుగనున్నాయి. ఫిబ్రవరి 13వ తేది మహాశివరాత్రి సందర్భంగా విశాఖలోని రామకృష్ణ బీచ్‌లో సాగరతీరాన కోటి శివలింగాలను ప్రతిష్టించి, శివనామ స్మరణల మధ్య వైభవంగా ఆ శివ లింగాలను అభిషేకించనున్నారు. అత్యంత వేడుకగా ఆ పరమేశ్వరునికి మహాకుంభాభిషేకం నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు ఈ మహత్కార్యం టిఎస్సార్ చేతుల మీదుగా జరుగనుంది. విశాఖ ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని ఈ వేడుకను తిలకించి తరించనున్నారు. అదేరోజు సాయంత్రం



జరిగే కళావేడుకల్లో భాగంగా ప్రఖ్యాత సినీనటుడు డా.కైకాల సత్యనారాయణను 'విశ్వనట సామ్రాట్' బిరుదుతో ఘనంగా సత్కరించనున్నారు. ఈ వేడుకల్లో విశాఖ శారదాపీఠం స్వామీజీ శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ అనుగ్రహ భాషణం చేయనున్నారు. యువరత్న నందమూరి బాలకృష్ణ, మోహన్‌బాబు, డా.కె.బ్రహ్మానందం, నటీమణులు మీనా, గౌతమి తదితరులతో పాటు రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు, ఎంపి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు ద్రోణంరాజు శ్రీనివాసరావు, కిల్లి కృపారాణి తదితరులు పాల్గొననున్నారు.

### ఆశాభోస్లేకి యష్‌చోప్రా అవార్డు :



టిఎస్ఆర్ లలిత కళాపరిషత్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16వ తేదిన ముంబైలో నేత్రపర్వంగా నిర్వహించే కళాసంబరాల్లో విఖ్యాత గాయనీమణి ఆశాభోస్లేకి ఎంతో ప్రతిష్టాత్మకమైన 5వ యష్‌చోప్రా స్మారక జాతీయ అవార్డు-2018ని ప్రదానం చేయనున్నారు. అదే విధంగా, విఖ్యాత నటీమణి రేఖకు స్వర్ణకంకణం బహూకరించనున్నారు. మహారాష్ట్ర గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్‌రావు, విఖ్యాత నటులు శత్రుఘ్న సిన్హా, మోహన్‌బాబు, ప్రముఖ నటీమణి జయప్రద ఇంకా ప్రముఖులు వివిన్ ధూత్, సుభాష్ ఘై, పమేలా చోప్రా తదితర సినీ దిగ్గజాలు, పలువురు ప్రముఖులు పాల్గొననున్నారు. టిఎస్సార్‌తో పాటు, అను రంజన్, శశి రంజన్‌లు పాల్గొని ఈ అద్వితీయమైన కార్యక్రమం నిర్వహించనున్నారు.

# అంతకంత పెరుగుతున్న ఆదరణ



నెల్లూరుజిల్లాలో వై.యస్.జగన్ ప్రజా సంకల్ప పాదయాత్ర చిరుగాలిలా మొదలై సుడిగాలిలా మారింది. ప్రజాదరణ అంతకంతకూ పెరుగుతోంది. ఒక సభనుమించి ఇంకో సభ విజయవంతమవుతోంది. జగన్‌ను చూడాలనుకుని వచ్చే జనం రోజురోజుకీ పెరుగుతున్నారు.

జనవరి 23వ తేదీన పెళ్ళకూరు మండలంలోని పెనబాక నుండి జిల్లాలో ప్రజాసంకల్ప పాదయాత్ర మొదలుకావడం తెలిసిందే! ఆరోజు నుండి ఈ నెల 7వ తేదీ వరకు సూళ్ళూరుపేట, గూడూరు, వెంకటగిరి, సర్వేపల్లి, నెల్లూరురూరల్, కోవూరు, ఆత్మకూరు నియోజకవర్గాలలో పాదయాత్ర పూర్తయ్యింది. నాయుడుపేట, గూడూరు, సైదాపురం, పొదలకూరు సౌత్‌మోపూరు, బుచ్చిరెడ్డిపాలెం, సంగంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలకు జనం పోటెత్తినట్లు వచ్చారు. నెల్లూరు రూరల్ నరసింహకొండ వద్ద నిర్వహించిన



ఆనం విజయ, కోటంరెడ్డిలతో జగన్



హసనాపురంలో జరిగిన మైనార్టీ సదస్సులో ప్రసంగిస్తున్న వై.యస్.జగన్

ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం, 7వ తేదీ హసనాపురం వద్ద నిర్వహించిన మైనార్టీల సదస్సు విజయవంతమయ్యాయి. 8వ తేదీ రాష్ట్ర బంద్‌కు మద్దతుగా జగన్ పాదయాత్రను ఆపారు. ఇక జిల్లాలో కావలి, ఉదయగిరి నియోజకవర్గాలలో మాత్రమే పాదయాత్ర చేయాల్సి వుంది.




8వ తేదీ దుండిగం క్రాస్ వద్ద బంద్‌లో పాల్గొన్న జగన్

# అపస్మా ఆటల పోటీలు




సమావేశంలో పాల్గొన్న అపస్మా నాయకులు బి.మనోహర్‌రెడ్డి, శౌరెడ్డి, ఎం.వి.సుబ్బారెడ్డి తదితరులు

ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(అపస్మా) ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 10, 11 తేదీలలో నెల్లూరులోని ఏ.సి స్టేడియం నందు ఆటలపోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.మనోహర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 8వ తేదీన నెల్లూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో మానసిక వికాసానికి, శరీర ధారుఢ్యానికి ఈ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 10వ తేదీ ఉదయం 9.30గంటలకు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలు ప్రారంభిస్తారని, 11వ తేదీ సాయంత్రం బహుమతి ప్రదానోత్సవ సభకు మేయర్ అబ్దుల్ అజీజ్, డిఇఓ శ్యామ్యూల్, యంఇఓ జగదీష్, కృష్ణచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ పి.చంద్రశేఖర్‌రెడ్డిలు హాజరవుతారని వెల్లడించారు. ఈ సమావేశంలో అపస్మా నాయకులు ఎం.వి. సుబ్బారెడ్డి, శౌరెడ్డి, రవికుమార్, రామ్మోహన్‌రెడ్డి, సి.హెచ్.శ్రీనివాసులు, బాలకృష్ణ, అభిషేక్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, థామస్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



# బంద్ సంపూర్ణం

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయానికి నిరసనగా 8వ తేదీ వామపక్షాలు, కాంగ్రెస్, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలు నిర్వహించిన బంద్‌కు నెల్లూరుజిల్లాలో స్పందన కనిపించింది. బంద్ ప్రకటనతో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు ముందుగానే సెలవు ప్రకటించారు. వ్యాపార, వాణిజ్య సంస్థలను మధ్యాహ్నం వరకు మూసేసారు. ప్రభుత్వ కార్యాలయాలకు సిబ్బంది రాలేదు. నెల్లూరులో మధ్యాహ్నం దాకా ఆర్టీసీ బస్సులు తిరగలేదు. నెల్లూరు నగరంలో వైకాపా ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో వందలాదిమంది కార్యకర్తలు బైక్‌లకు పార్టీ జెండాలు కట్టుకుని రోడ్ల మీద తిరుగుతూ బంద్‌ను పర్యవేక్షించారు. నగరంలోని పలు సెంటర్‌లలో వామపక్షాల కార్యకర్తలు జెండాలు పట్టుకుని వాహనాలను అడ్డుకున్నారు. బంద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా అంతటా ముఖ్యమైన ప్రాంతాలలో భారీగా పోలీసులను మోహరించారు.














Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com